
అపరిశుభ్రత వాతావరణంలో శుద్ధి జలప్లాంటు

మాయాజలం...!

- పుట్టగొడుగుల్లా ఆర్వో ప్లాంట్లు
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- అనుమతులు లేకుండానే వ్యాపారాలు
- తనిఖీలు చేయకపోవడంతో ఇష్టారాజ్యం



ఆదోని, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో భాగంగా ప్రజలు ప్యూరిఫైడ్ నీటిని తాగేందుకు అలవాటు పడ్డారు. ఆరోగ్యం కోసం అంటూ ఆర్వో ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. నిజానికి ఆర్వోప్లాంట్లలో స్వచ్ఛమైన తాగునీరు వస్తున్నాయా? అన్న విషయాన్ని కూడా పక్కనే పెట్టే ప్రజలు ఆర్వో నీటి కోసం పరుగులు పెడుతున్నారు. జనావాసాల మధ్య బోర్లు వేసి నిబంధనలు పాటించకుండా వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో తూతూమంత్రంగా బోరు నీటిలో కొన్ని కెమికల్స్ కలిపి నీటిని సరఫరా చేస్తున్నారు. నిబంధనలు పాటించని నీటి ప్లాంట్లపై అధికారులు తనిఖీలు చేయకపోవడం నిర్వాహకులకు కాసుల వర్షం కురిపిస్తోంది. నాణ్యత లేని నీటిని తాగి పలు ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు సైతం అనధికారికంగా కొనసాగుతున్న తాగునీటి ప్లాంట్లవైపు కన్నెత్తి చూడకపోవడంతో నిర్వాహకులు మరింత రెచ్చిపోతున్నారు. ఏది ఏమైనా కర్నూలు జిల్లాలో నిబంధనలను కాలరాస్తూ సురక్షిత నీటి పేరుతో విచ్చలవిడిగా ఆర్వో ప్లాంట్లు పుట్టుకొస్తున్నాయి. అసలే వేసవి కావడంతో ఇదే అదునుగా భావించి జిల్లాలో ఎక్కడ చూసినా ఆర్వో ప్లాంట్‌లు (తాగునీటి సురక్షిత ప్లాంట్) విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. ఆదాయమే లక్ష్యంగా నిర్వాహకులు నిబంధనలకు పాతరేసి విక్రయాలు చేస్తున్నారు. జిల్లాలో ఆర్వో ప్లాంట్ల ద్వారా సురక్షిత నీటి పేరుతో నెలకు రూ.కోట్లలో వ్యాపారం సాగుతోంది. బిందె రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. అదేవిధంగా 20 లీటర్ల వాటర్‌క్యాన్ రూ.10 నుంచి రూ.15 వరకు ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో రోజుకు 16 లక్షల లీటర్ల పైగా అమ్మకాలు జరుగుతున్నట్లు అంచనా. పట్టణాల్లో అయితే ట్రేడ్ లైసెన్స్ తీసుకొని అక్రమంగా నీటి వ్యాపారం సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

నిబంధనలకు మంగళం

నిబంధనల ప్రకారం ఎవరైనా ఆర్వో ప్లాంట్ పెట్టాలంటే స్థానిక పంచాయతీ లేదా.. సచివాలయం, మున్సిపాలటీల ద్వారా అనుమతి పొందాలి. అదేవిధంగా ట్రేడ్ లైసెన్సు కూడా పొందాలి. తమ దరఖాస్తుతో పాటు అద్దె లేదా సొంత స్థలానికి సంబంధించిన ఆస్తి పన్నుల వివరాలు, తమ అడ్రస్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను అందజేయాలి. ప్రధానంగా నీటి నాణ్యతను ధ్రువీకరించే ఐఎస్ఐ వంటి సంస్థల నుంచి పత్రం పొందాలి. బోర్ పర్మిషన్ కూడా ఉండాలి. నిజానికి ఒక ప్లాంట్ ఏర్పాటు కోసం సుమారుగా రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నాణ్యమైన పాలిథిలిన్, పాలీ ప్రొపలైన్‌తో తయారు చేసిన నీటి క్యాన్లను మాత్రమే వినియోగించాలి. నీటి నాణ్యతను పరిశీలించేందుకు కెమిస్ట్రీ ల్యాబ్ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. కానీ ఈ నిబంధనలను లెక్కచేయని నిర్వాహకులు రూ.2లక్షల ఖర్చుతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఓ రేకుల షెడ్డు, సింథటిక్ ట్యాంకు, తక్కువ ధరకు ఓ నీటి శుద్ధి యంత్రంతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని నీటిని విక్రయిస్తున్నారు.

తనిఖీలు చేస్తున్నారా?

జిల్లాలో ఆర్వో ప్లాంట్ ద్వారా నెలకు రూ. కోట్లలో వ్యాపారం జరుగుతోంది. నిబంధనలు పాటించని ఆర్వో ప్లాంట్ నిర్వాహకులపై తనిఖీలు ఆశించిన స్థాయిలో చేయకపోవడంతో ఆయా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యాపారాలు చేసి సొమ్ముచేసుకుంటున్నారు. కనీస నిబంధనలు పాటించకపోవడంతో పాటు సదరు ఆర్వోప్లాంట్ల ద్వారా వచ్చే నీరు సురక్షితమైనదా? కాదా? అనే తెలుసుకునే అవకాశం కూడా లేకపోవడంతో ఆర్వో ప్లాంట్ల నుంచి ప్రజలు నీటిని తెచ్చుకుంటున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యాన్ని నీటి రూపంలో కొని తెచ్చుకుంటున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులను కట్టడి చేయాలని నీటి శుద్ధి ప్రక్రియ చేయని నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ నాణ్యతా ప్రమాణాలను అతిక్రమించి నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.


అపరిశుభ్రంగా ఉన్న వాటర్ క్యాన్లు

ఇవేమైనా పాటిస్తున్నారా?

- ప్రతి రోజూ టోటల్ డిసాల్వ్‌డ్ సాలిడ్స్(టీడీఎస్) పరికరంతో పరిశీలించి నీటి సాంద్రత ఎంత ఉందో నమోదు చేసుకోవాలి.
- ఆర్వో ప్లాంట్ల నుంచి నీటిని తీసుకెళ్లే క్యాన్లు మూడు లేదా.. నాలుగు నెలలు మాత్రమే వాడాలి. ఆ తర్వాత వినియోగించరాదు.
- ప్రతి నెల ప్లాంట్లలోని యంత్రాల్లో ఉండే ఫిల్టర్లను శుభ్రం చేయాలి. పాడైతే తక్షణమే కొత్తవి వేయాలి.
- ఆర్వో ప్లాంట్ల నుంచి సరఫరా చేసే క్యాన్లపై తమ కంపెనీ వివరాలు, ధర, నీటి ప్యాకింగ్ తేదీ, ఐఎస్ఐ సర్టిఫికెట్ నంబరు, లైసెన్స్‌తో పాటు తమ ప్లాంట్ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలి.


అనుమతి లేకుండా ఉన్న వాటర్ ప్లాంటు

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

- భావితరాలకు మార్గదర్శకులు కావాలి
- కలెక్టర్ రంజిత్ బాషా
- పదో తరగతి విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆకాంక్షించారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కర్నూలు జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు 17మంది విద్యార్థులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం పదో తరగతిలోని విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావాలని ప్రత్యేకంగా కృషిచేశామని, అందుకోసం తీసుకున్న చర్యలతో ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. భావితరాలకు మార్గదర్శకాలు ఉండాలని సూచించారు. పదో తరగతి తర్వాత విద్యార్థులకు మంచి కేరీర్‌ను ఎంచుకునేందుకు వీలుగా, పోటీ పరీక్షలో పాల్గొనడానికి 'నైపుణ్య' పేరు శిక్షణా తరగతులు ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. డీఈవో శామ్యూల్‌పాల్ మాట్లాడుతూ జిల్లాలో ఏడుగురు విద్యార్థులు 600మార్కులకు గానూ 597 మార్కులు సాధించి జిల్లాను అగ్రభాగాన నిలిపారన్నారు. గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ శ్రీదేవి, జిల్లా అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ కృష్ణారెడ్డి, పోటీపరీక్షల నిర్వాహకుడు గణేష్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన, అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ కృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ శ్రీదేవి, వెల్దుర్తి బీసీ వెల్ఫేర్ హాస్టల్ ప్రిన్సిపాల్ సబీనా, విద్యార్థుల తల్లిదండ్రులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

వైసీపీ కార్పొరేటర్‌పై ఫిర్యాదు

కర్నూలు క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని పదోవార్డు వైసీపీ కార్పొరేటర్ యూనిస్‌బాషాపై పోలీస్ స్టేషన్‌లో టీడీపీ కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లో కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిల్ సమావేశంలో కుర్చీలు నేలకేసి కొట్టడంతో పాటు తమను అసభ్య పదజాలంతో దూషించాడని కార్పొరేటర్ పరమేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఇన్‌చార్జి సీఐ నాగశేఖర్ తెలిపారు.

స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తులు

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అర్హత కలిగిన మైనార్టీలు మే 25వ తేదీలోపు మైనార్టీ స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీస్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పర్వీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద మైనార్టీలకు చెందిన వారికి రూ.లక్ష నుంచి 8లక్షల వరకు, క్రైస్తవ మైనార్టీ చెందిన వారికి రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు 50 శాతం సబ్సిడీ మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. 21 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు సంవత్సరానికి, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు ఆదాయం కలిగి ఉండాలని సూచించారు. వివరాలకు 98488 64449, 94408 22219 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

సాంక్షేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి

- సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించాలి
- ఎస్పీ విక్రాంత్ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణకు బాగా కృషి చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరగాళ్లను పట్టుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లలో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసులను సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా కేసుల పెండింగ్‌కు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ డివిజన్ల వారీగా క్రైం పార్టీ పోలీసు బృందాలను ఏర్పాటుచేసి రికవరీ పర్సంటేజీలు బాగా పెంచి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రతిరోజూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డయల్ 100 పోలీసులు బాగా పనిచేయాలన్నారు. పోలీసు అధికారులు గ్రామాల్లో పర్యటించి, సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఆదివారం ఖచ్చితంగా రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 4వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన జిల్లా పోలీసు అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా మాట్లాడుతూ మహిళలపై నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ కేసులను ఛేదించిన పోలీసులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు ఎస్పీ అందజేశారు. సమావేశంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు బాబుప్రసాద్, శ్రీనివాసాచారి, వెంకట్రామయ్య, ఉపేంద్ర బాబు, హేమలత, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కుర్చీలను నేలకేసి కొట్టారు

- రెచ్చిపోయిన టీడీపీ, వైసీపీ కార్పొరేటర్లు
- రణరంగమైన కర్నూలు నగరపాలక సంస్థ సమావేశం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హుందాగా వ్యవహరించాల్సిన కార్పొరేటర్లు విజ్ఞత మరిచారు. సభలో ప్రజా సమస్యలను లేవనెత్తాల్సింది పోయి కుర్చీలను నేలకేసి కొట్టారు. వైసీపీ, టీడీపీ కార్పొరేటర్లు ఒకరిపై ఒకరు దూషణలకు పాల్పడుతూ తాము ప్రజాప్రతినిధులం అన్న విషయాన్ని మరిచారు. శనివారం సుంకేసుల రోడ్డులోని నూతన కౌన్సిల్ హాల్‌లో మేయర్ బీవై రామయ్య ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కార్పొరేటర్లతో పాటు ఎక్స్ అఫిషియో హోదాలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. 'కౌన్సిల్ సమావేశంలో తమ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పడం లేదు. కార్పొరేటర్ల మాటకు విలువ లేదా? కౌన్సిలకు వచ్చేది సమోసాలు, శాండ్‌విచ్ తినేందుకేనా..' అంటూ వైసీపీ కార్పొరేటర్లు మేయర్ బీవై రామయ్యను నిలదీశారు. దీంతో 'మేయర్ రామయ్య మీ పార్టీ వాడే.. ఆయనే సమాధానం ఇవ్వాలి. మీరే గట్టిగా నిలదీయండి..' అంటూ టీడీపీ కార్పొరేటర్లు కె.పరమేశ్, క్రాంతికుమార్ ప్రతిగా స్పందించారు. దీంతో టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఆ క్రమంలో వైసీపీ కార్పొరేటర్ యూనుష్ కుర్చీలు, వాటర్ బాటిల్స్ నేలకేసి కొట్టారు. సమావేశం ప్రారంభం కాగానే గత సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మినిట్ రూపంలో సమాధానం ఇవ్వాలి.. ఎందుకు ఇవ్వడం లేదని కార్పొరేటర్లు నిలదీయడంతో వాగ్వాదం మొదలైంది. తర్వాత వైసీపీ కౌన్సిలర్లు వాకౌట్‌చేసి వెళ్లిపోయారు. పరిస్థితి చేయిదాటిపోతుందని గ్రహించిన మేయర్ రామయ్య సమావేశం పది నిమిషాలు వాయిదా వేశారు.


కుర్చీలను నేలకేసి కొడుతున్న వైసీపీ కార్పొరేటర్

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్
- ముగిసిన చంద్రబాబు జన్మదిన వారోత్సవాలు



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి పత్తి ఓబులయ్య తదితరులు

వివరాలు 6లో

పోలీసుల బదిలీకి కౌన్సెలింగ్

కర్నూలు క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పోలీసుల బదిలీకి శనివారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో ఐదేళ్లు విధులు నిర్వర్తించిన వారికి బదిలీ చేశారు. 154 మందిని కౌన్సిలింగ్‌కు పిలువగా.. వీరిలో 12 మంది ఏఎస్ఐలు, 24మం ది హెడ్ కానిస్టేబుళ్లు, 118 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. సీనియారిటీ జాబితా ప్రకారం ప్రొజెక్టర్‌పై ప్రదర్శించి ఖాళీలకు అనుగుణంగా కానిస్టేబుళ్లు కోరుకుంటున్న బదిలీలు చేపట్టారు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, ప్రజల భద్రతే ముఖ్యమని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ హుశేన్‌పీరా, ఏవో విజయకుమార్, సీఐ తేజమూర్తి, ఎస్ఐలు ఖాజావలి, వేణుగోపాల్ ఉన్నారు.


కౌన్సెలింగ్‌కు హాజరైన పోలీసులు

బాలికల సాధికారతకు కార్యాచరణ

- ఐసీడీఎస్ పీడీ డాక్టర్ నిర్మల
- కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల జోనల్ సదస్సు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కిషోర వికాసం కింద యుక్త వయస్సు బాలికల సాధికారతకు గ్రామాల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కర్నూలు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల పేర్కొన్నారు. నగర శివారులోని జీవసుధ ప్రాంగణంలో కిషోర వికాసంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణకు కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల నుంచి నోడల్ ఆఫీసర్లు, సీడీపీవో, డీసీపీవోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించడానికి అన్నిశాఖలతో కలిసి ముందుకు వెళ్లాలన్నారు. కడప జిల్లా జీసీడీవో అనిత మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయంతో జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కడప జిల్లా మెప్మా సీఈవో కల్పన మాట్లాడుతూ గ్రామంలో మహిళా సాధికారిత కోసం ఎస్‌జీ సంఘ సభ్యుల ద్వారా చర్చించాలన్నారు. కర్నూలు జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో హోంశాఖలో బాలల, మహిళల పరిరక్షణకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. అనంతరం యునిసెఫ్ ప్రతినిధులు జాన్స్, నరసింహమూర్తి, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ స్టేట్ ఆఫీసర్ కమల్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీపీవో టి.శారద, డీసీపీఓ సిబ్బంది శ్రీలక్ష్మి, దీప, గీతా, పద్మ, నరసింహులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


జోనల్ సదస్సును ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ నిర్మల

తుంగభద్ర తీరం సాహిత్యం



'ఆధునిక మహా భారతం' వర్తమాన భాష్యం

- ప్రజా చైతన్య కవిత్వం రాసిన గుంటూరు శేషేంద్రశర్మ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'బాబూ నీ చిన్ని కన్నీటి బిందువులో ఏ సముద్రం గర్జిస్తూ ఉందో నాకు తెలుసు, అందుకే నేను చెట్లకు మొరపెట్టుకుంటున్నాను...ఆకులు కాదు, తుపాకులు కాయండని' అంటూ నేటి ఆధునిక సామాజిక పరిస్థితులకు భాష్యం చెబుతారు 'ఆధునిక మహాభారతం' కవితా సంకలనంలో ప్రఖ్యాత కవి గుంటూరు శేషేంద్రశర్మ. కవిత్వం రాయాల్సింది ప్రజల కోసమేనని చెబుతూ 'ఒక అందమైన పోయెమ్ అంటే...దానికి ఒక గుండె ఉండాలి/అది కన్నీళ్లు కార్చాలి/క్రోధాగ్రుల్ని పుక్కిలించాలి/పీడితుల పక్షం అవలంబించాలి/మనిషి రుణం తీర్చుకోవాలి' అని సమాజంలో కవి బాధ్యతను తెలియజేస్తారు. ఈ ఆధునిక భారత పుస్తకం వ్యాస మహర్షి విరచిత 18 పర్వాల భారతం కాదు. దేశ ప్రజల కన్నీళ్లను, కష్టాలను, ఆవేదనను, చైతన్యాన్ని ఆవిష్కరించే నిజమైన ఆధునిక మహాభారతం. ప్రాచీన భారతం, ఉత్తర భారతదేశంలో పండిత భాషలో పుడితే, ఆధునిక మహాభారతం ప్రజల భాషలో పుట్టింది. వ్యాస భారతం భూమి కోసం జరిగిన యుద్ధమైతే, ఈ ఆధునిక మహాభారతం ప్రజానీకం తమ కోసం యుద్ధం చేస్తారు. కర్షకుడు పాలకుల కుతంత్రాల్లో చిక్కుకొని వ్యాపార సంస్కృతితో పోటీ పడలేక సంఘర్షణలో ఉన్న వ్యక్తికి సరైన దిశా నిర్దేశం చూపగలిగేది కచ్చితంగా కవి మాత్రమే అని చెబుతూ 'సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చొని మొరగదు/తుపాను గొంతు చిత్తం అనడం ఎరుగదు/పర్వతం ఎవడికీ వంగి సలాం చేయదు/ నేనంతా ఒక పిడికెడు మట్టే కావచ్చు/కానీ కలమెత్తితే ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది అనే కవిత విస్ఫోటనంలా పేలుతుంది. పేద ధనిక మధ్యగల వ్యత్యాసాన్ని చెబుతూ కొందరు పుట్టక ముందే గొప్పతనం వాళ్లను పరీక్షిస్తుంది/కొందరు చచ్చిన తర్వాత కూడా వాళ్లని గొప్పదనం పరీక్షిస్తుంది/ఒకడు పుష్పహారాల బరువుతో పొంగిపోతాడు/ఒకడు గాయాలు లెక్కపెట్టుకుంటూ ఉప్పొంగి పోతాడు అని తెలియజేస్తారు. శేషేంద్ర కవిగా సాగు చేసిన ఫలసాయమంతా ఒకచోట చేరిస్తే అదే 'నా దేశం నా ప్రజలు' అనే ఆధునిక మహాభారతం. నిరంతర శ్రమ ఫలితమే మానవ నాగరికత. నగరీకరణలో ఎక్కడ, ఎప్పుడు, ఎలా లోపం జరిగిందో తెలియదు గాని, దాని ఫలితంమే నేడు మనం చూస్తున్న అసమ సమాజం. ఎందుకిలా జరిగిందో ఊహించగలం. మనిషి స్వార్థం వల్ల, విశాల దృష్టి లేకపోవడం వల్ల, సంకుచితత్వం వల్లనే ఇదంతా అంటారు ఆయన. అలాగే దీనికి విరుగుడు కూడా ఆయన స్పష్టంగా చెప్పారు. ఈ దేశ నాగలి ప్రతీక, ఈ దేశపు ఆకృతి నాగలి. ఇవి రెండూ ఒకదాన్ని ఒకటి పోలి ఉంటాయి. జీవన కథానాయకుడు కర్షకుడే. అతడే ఈ దేశపు జీవన దాన ప్రభువు అని అంటూ రైతు నాగలి మోస్తున్నాడు/ క్రీస్తు శిలువ మోస్తున్నట్లు/ ఈ ఏడాది పైర్ల దుఃఖం తీరకపోతే వచ్చే ఏడాది ఇట్టి కొడవళ్లు పట్టుకున్న పిడికిళ్లే మొలుస్తాయి.. అని రైతుల గురించి వ్యథ చెందుతాడు.

ఆధునిక మహాభారతం చదివితే బానిస మనస్తత్వం కారణంగా వంగిపోయిన కాళ్లలో బలం వచ్చి మనిషి కాళ్లు నిటారుగా నిలుస్తాయి. ఈ కల నెరవేరడానికి ఆధునిక మహాభారతాన్ని ప్రజాపర్వం, సూర్యపర్వం, పశుపర్వం, ప్రవాహ పర్వం, ఆదర్శ పర్వం, ప్రేమ పర్వం, సముద్ర పర్వం, జ్యోత్స్న పర్వం, మౌక్తిక పర్వం, మయూర పర్వం అని ఆయన విభజించారు. దివంగత గుంటూరు శేషేంద్రశర్మ రవీంద్రనాథ టాగోరు తర్వాత నోబుల్ సాహిత్య పురస్కారానికి నామినేట్ చేయబడిన సాహిత్యవేత్త. పాఠకులకు కొసమెరుపు ఏమంటే... ఇంత మంచి పుస్తకాన్ని రాసిన రచయితను, ఎప్పుడో 30 ఏళ్ల కిందట అచ్చయిన పుస్తకాన్ని పునర్ముద్రించి, నేటి తెలుగు పాఠక లోకానికి అందజేసిన సినీ కథానాయకుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కుమార్‌కు కూడా కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



- మానుక్రింది వెంకటేశ్, తెలుగు ఉపాధ్యాయుడు, ఆదోని

విత్తనం నేను...!

విత్తనం నేను...
మట్టిలో పెడితే మొలకనై వస్తా
చారెడు నీళ్లు పోస్తే...పచ్చగా చిగురిస్తా
చెట్టునవుతా విరబూస్తా విరులనిస్తా...!

నెలతల నెచ్చెలినవుతా
ఫలాలనిస్తా ఆకలి తీరుస్తా
ధాన్యమిస్తా...ధనమిస్తా...
రైతు నేస్తాన్ని అవుతా...!

నీడను ఇస్తా...సేద దీరుస్తా
గాలిని
ఇస్తా...ప్రాణవాయువును
అవుతా
ఆయుర్వేద దేవతగా
ఆయువును పోస్తా
వన దేవతనై వరాలు ఇస్తా,
వర్షాలు కురిపిస్తా...!

ఎండిపోతే మీకు కలపనై
సహాయపడతా
మీ ఇంటి మూలస్తంభమై ఆసరానిస్తా
కాగితాన్ని అవుతా...కథల పుస్తకాన్ని
అయి మురిపిస్తా
మీ కోసమే జీవిస్తా...మీ కోసమే
మరణిస్తా...!

ప్రకృతిలో కలిసి ఉంటా..ప్రతి చోటా
చిగురిస్తా
నా ఉనికి మీ ఊరికే అందం...నా ఊహ
మదికి ఆహ్లాదం
పచ్చదనానికి మీరు ప్రతిన
బూనండి
హరిత విప్లవానికి పతిజ్ఞ
చేయండి...!!



- ధరిత్రీదేవి, కర్నూలు



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

పహల్గామ్ ఘటనపై కోటేష్ 'చిత్ర'నివాళి



చిత్రకారుడు కోటేష్ గీసిన చిత్రం

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల తూటాలకు 26 మంది భారతీయులు మరణించారు. ఈ దారుణ ఘటనను చిత్రకారుడు తన చిత్రంలో అద్భుతంగా చిత్రించి వారికి నివాళులర్పించారు. ఈ చిత్రంలో 26 మంది భారతీయులను చంపిన ఉగ్రవాదుల తలలను నరికి భరతమాతకు సెల్యూట్ చేసి చూపిస్తున్న భారత్ జవాన్, భారత మాత ఆనందంగా వీరజవాన్‌కు ఆశీస్సులు అందజేసినట్లు చూపించారు. అదేవిధంగా పాకిస్తాన్‌ను విష సర్పంగా పోలుస్తూ ఇండియన్ ఆర్మీ కాలితో పాక్ కాలనాగును తొక్కుతూ బులెట్ల వర్షం కురిపిస్తున్నట్లు చిత్రాన్ని గీశారు. యుద్ధానికి సిద్ధం అనేలా యుద్ధవిమానాలను కూడా చిత్రంలో చూపించారు. ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న పాకిస్తాన్ విషసర్పాన్ని ముట్టుపెట్టాలి. ప్రపంచ పటంలో పాకిస్తాన్ లేకుండా చేయాలని చిత్రకారుడు కోటేష్ అభిప్రాయపడ్డారు.

నాటకం, సినిమా రెండు కళ్లు



కోర్టు సినిమాలో ప్రధాన పాత్రలో నటించిన సురభి ప్రభావతి



- సూర్యకాంతం, ఛాయాదేవి చేసిన గయ్యాళి పాత్రల్లో నటించాలని ఉంది
- సినీ అవకాశాలు పెరిగినా రంగస్థలం నాకు అమ్మలాంటిదే
- ప్రముఖ రంగస్థల నటీమణి, సినీ క్యారెక్టర్ ఆర్టిస్టు సురభి ప్రభావతి

ఆమె సాత్వికాభినయం అనిర్వచనీయం.. వాచకం అద్భుతం.. ఆహార్యం బహు ప్రశంసనీయం.. వెరసి ఆమె నటనా కౌశల్యం శ్లాఘనీయం.. నవరసాలను కలబోసి ప్రభవించిన ప్రతిభాశాలి.. ఆమె పేరు సురభి వనారస ప్రభావతి. రంగస్థలంపై ఏ నాటకమైనా, సినిమాలో ఏ పాత్ర అయినా తనదైన ముద్రతో ప్రేక్షకుల హృదయాల్లో ఒక శాశ్వత స్థానం సంపాదించుకుంటున్నారు. సురభి నాటక సమాజం నుంచి ఆరంభమైన ఆమె నట జీవితం నాటక రంగంలో ముప్పయ్ ఏళ్లుపైగా కొనసాగగా, గత దశాబ్ది కాలంలో తెలుగు సినీ రంగంలోనూ అద్భుతమైన పాత్రలు పోషిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకత చాటుకుంటున్నారు. కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన సాంస్కృతిక వారోత్సవాల సందర్భంగా కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య దర్శకత్వంలో ప్రదర్శించిన 'జగదేక సుందరి సామా', 'శ్రీకృష్ణ కమలపాలిక' నాటకాల్లో ఆమె నటించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో ఆమె మాట్లాడారు. ఆ ఇంటర్వ్యూ విశేషాలు ఆమె మాటల్లోనే...!



కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మాది పౌరాణిక నాటక ప్రదర్శనల్లో ప్రపంచ ఖ్యాతి పొందిన సురభి కుటుంబం. అమ్మ కమలమ్మ, నాన్న కుమార్ బాబు ఇద్దరూ సురభి ఆర్టిస్టులే. భర్త నగేష్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. మా తాత పూర్ణ చంద్రశేఖర్ ప్రఖ్యాత నటులు. అలా ముప్పయ్ నలభై మంది కలసి నాటకం వేసి ఉమ్మడి కుటుంబం మాది. నేను 1980 జూన్ 27న పుట్టాను. అప్పటికే మా సురభి టెంట్లు, విలువైన సామగ్రితో పాటూ సర్వం అగ్నిప్రమాదంలో ఆహుతైంది. దీంతో ఎవరంతకు వాళ్లం నాటకాలు వెతుక్కుని వేసే పరిస్థితి ఉండేది. అలా మెదక్ జిల్లా చేగుంటలో స్థిర నివాసం ఏర్పరచుకున్నాం. కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల పెద్దగా చదువుకోలేదు. గుణసుందరి కథ అనే పౌరాణిక పద్య నాటకంలో చిన్న వేషంతో నేను రంగస్థలపై అరంగ్రేటం చేశాను.

సినీ అవకాశాలు మంచి గుర్తింపు తెస్తున్నాయి...

ఇటీవల విడుదలైన 'కోర్టు' సినిమా నాకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఇందులో సినిమా మొత్తంగా పూర్తిస్థాయిలో నటించాను. అలాగే సాధారణ పేద వర్గాలకు చెందిన యువకుడి తల్లిగా మంచి పాత్ర లభించింది. 30కి పైగా చిత్రాల్లో నటించాను. ఇంకా నాలుగైదు చిత్రాల్లో నటిస్తున్నాను. అవి షూటింగ్స్ జరుగుతున్నాయి. నా సినీ రంగ ప్రవేశం 2008లో బతుకమ్మ అనే చిత్రం ద్వారా జరిగింది. అలాగే దొరసాని, మిడిల్ క్లాస్ మెలోడీలు, సురాపానం, మసూద, ఇంటింటి రామాయణం, దసరా, రాత్రి 7:11 గంటలకు, చాప్టర్ 1, బెదురులంక 2012, మధుమాసం, వ్యూహం, గుంటూరు కారం, ది ఫ్యామిలీ స్టార్, ఆరంభం, సరిపోదా శనివారం, ఆదిగురువు అమ్మ, ఆర్‌టీఐ, లైలా వంటి చిత్రాల్లో అవకాశాలు లభించాయి. నాటక సమాజం నుంచి రావడం సినిమాల్లో నటనకు అవకాశం సుళువుగానే మారింది. అయితే నాటకం కన్నా, సినిమాల్లో నటించడం కష్టం.



నాటక రంగంలో సురభి జమునారాణి ప్రోత్సాహంతో...



మాకు పిన్ని వరుస అయ్యే ప్రముఖ రంగస్థల నటి సురభి జమునారాణి 'శశిరేఖా పరిణయం' పౌరాణిక పద్య నాటకంలో మంచి వేషం ఇచ్చారు. అందులోని పద్యాలు, నటన, హావాభావాలు నాకు మంచి పేరు తెచ్చాయి. అప్పుడే హైదరాబాద్‌కు చెందిన రసరంజని, ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ట్స్‌కో తదితర నాటక సమాజాలు సాంఘిక నాటకాల్లోనూ అవకాశాలు ఇచ్చాయి. అక్కడ కూడా మంచి పేరు వచ్చింది. దీంతో 2005 నుంచీ బిజీ ఆర్టిస్టుగా మారిపోయాను. ముప్పయ్ ఏళ్ల రంగస్థల నాటకాల్లో ఇప్పటి వరకు సుమారు 6 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. ఇంకా అనేక నాటకాల్లో నటిస్తున్నాను.

గయ్యాళి క్యారెక్టర్లు వేయడం ఇష్టం...

నాకు సినిమాల్లో గయ్యాళి క్యారెక్టర్లు వేయడం చాలా ఇష్టం. వాటి కోసం ఎదురు చూస్తున్నాను. సూర్యకాంతం, ఛాయాదేవి వంటి మహా నటీమణులు మళ్లీ రారు. వారి నటన ఇతరులు అనుకరించడం, అనుసరించడం అసాధ్యం. అలా ఒక స్థానాన్ని సంపాదించుకున్న నటీమణులు వారు. నాకు నటనలో వారే స్ఫూర్తి కూడా. అందుకే నాటక రంగంలోనైనా, సినీ రంగంలోనై గయ్యాళి అత్తలు, అమ్మల క్యారెక్టర్ల రావాలని కోరుకుంటున్నాను.



ఆరంభం చిత్రంలో ముఖ్య భూమిక పోషించిన ప్రభావతి

నాటక రంగంలో వరించిన పురస్కారాలు ఎన్నో...

నాటక రంగంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి 5 నంది పురస్కారాలు అందుకున్నాను. అందులో కర్ణార్జునీయం, విప్రనారాయణ రెండు నాటకాలను కర్నూలు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో, పత్తి ఓబులయ్య దర్శకత్వంలో ప్రదర్శించాము. అలాగే తిరుపతి గరుడ పురస్కారాలు 6, ఒంగోలు ఎన్టీయార్ జాతీయ పురస్కారాలు 7 లభించాయి. మరెన్నో కళాసంస్థల వారు వివిధ పురస్కారాలు ప్రదానం చేశాయి. నాకు ఇంత భవిష్యత్తును ప్రసాదించిన నాటక రంగంలో కొనవూపిరి ఉన్నంత వరకు కొనసాగుతూనే ఉంటాను. ఉన్నంతలో సంతృప్తిగా జీవించడంలోనే గొప్ప ఆనందం ఉంది. ఈ సూక్తిని అన్ని వేళలా నమ్ముతాను. అదే ఆచరిస్తూ ఉంటాను.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్
- టీజీవీ కళాక్షేత్రంలో ముగిసిన చంద్రబాబు జన్మదిన వారోత్సవాలు



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి, పత్తి ఓబులయ్యతో సత్కారం పొందిన కళాకారులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో గాడితప్పిన రాష్ట్రాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తున్నారని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ పేర్కొన్నారు. చంద్రబాబు దిశా నిర్ధేశంతోనే రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకు వెళ్తోందన్నారు. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో వారం రోజులుగా కొనసాగిన ముఖ్యమంత్రి జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన టీజీ వెంకటేశ్, చిత్ర నిర్మాత బీవీ రెడ్డి సీఎం చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్ర పురోగతికి రోజుకు 20 గంటలు శ్రమిస్తున్నారన్నారు. చంద్రబాబు పనితీరు, అంకితభావంతో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఎన్టీఆర్ తర్వాత రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు తీయించిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. బీవీ రెడ్డి మాట్లాడుతూ 1982లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుల్లో తాను ఒకరినని గుర్తు చేశారు. 1988 వరకు పార్టీలో పనిచేసి, ప్రస్తుతం ఆధ్యాత్మిక, పారిశ్రామిక రంగంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య మాట్లాడుతూ వారం రోజుల్లో జిల్లాలోని వంద మంది కళాకారులకు, ఇటీవల ఉగాది, కందుకూరి పురస్కారాలు అందుకున్న కళాకారులు, సాహితీవేత్తలకు సత్కారాలు చేశామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జన్మదిన వజ్రోత్సవ వారోత్సవాలు నిర్వహించిన ఘనత టీజీవీ కళాక్షేత్రానికే దక్కుతుందన్నారు. చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషితోపాటూ కళారంగానికి అందిస్తున్న చేయూతను కళాకారులు జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు.

అలరించిన శ్రీవేంకటేశ్వర మహత్యం

టీజీవీ కల్చరల్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో, ఆ సంస్థ అధ్యక్షుడు వీవీ రమణారెడ్డి దర్శకత్వంలో ప్రదర్శించిన శ్రీవేంకటేశ్వర మహత్యం భక్తిరస నాటకం అసాంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ నాటకంలోని కళాకారులను టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి, గ్రంథాలయ సంస్థ పూర్వ చైర్మన్ కేజీ గంగాధరరెడ్డిలు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీజీవీ కళాక్షేత్రంలో శనివారం నుంచి ప్రారంభించిన వేసవి శిక్షణ శిబిరాన్ని టీజీ వెంకటేశ్ ప్రారంభించారు. నటరాజ చిత్రపటానికి పూలదండలు వేసిన ఆయన చిన్నారులను ఆశీర్వదించారు.



శ్రీ వేంకటేశ్వర మహత్యం భక్తిరస నాటకంలో ఒక దృశ్యం

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెంచాలి

- ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలి
- అధికారులకు కలెక్టర్ రంజిత్ బాషా సూచనలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పెంచాలని, ఈమేరకు రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రంజిత్ బాషా వ్యవసాయాధికారులను ఆదేశించారు. కర్నూలు నగరంలోని ఉద్యాన శాఖ భవనంలో శనివారం వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై గ్రూప్ కన్వీనర్, కో కన్వీనర్లకు, అధికారులకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ నిర్వహణను రైతులు మెరుగుపరుచుకోవడం, కూలీల ఖర్చులను తగ్గించడం, పంట నాణ్యత దిగుబడి పెంచడం, పురుగు మందుల వాడకాన్ని తగ్గించడం వంటి ఫలితాలు డ్రోన్ల వినియోగం వల్లే సాధ్యమవుతుందని అన్నారు. జిల్లాలో 38 రైతు గ్రూపులకు 38 డ్రోన్లను అందించాలని, వాటిలో మూడు గ్రూపులకు అనుమతులు కూడా ఇచ్చినట్లు తెలిపారు. త్వరితగతిన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయించి రైతుల చేత డ్రోన్ల వినియోగాన్ని తక్షణం చేపట్టాలని బ్యాంకర్ల ఏడీఎంలను ఆదేశించారు. ప్రతి మండలంలో ఒక ఆదర్శ గ్రామాన్ని తీర్చిదిద్దాలని, 12 ఎకరాల నుంచి 1000 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని అందులో వ్యవసాయ అనుబంధ శాఖల కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాల గురించి వివరించాలన్నారు. జేసీ డా.బి.నవ్య, జిలా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాఘవేంద్ర చౌదరి, ఎల్‌డీఎం రామచంద్రరావు, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, డ్రోన్ల గ్రూప్ కన్వీనర్, కో కన్వీనర్లు రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సత్వర న్యాయం అందించాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది




ప్రసంగిస్తున్న కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): న్యాయాధికారులు వివిధ చట్టాలపై అవగాహన పెంచుకుని సత్వర న్యాయం అందించాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది సూచించారు. నగరంలోని జిల్లా కోర్టులో శనివారం ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయాధికారుల వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో ప్రధాన భూమిక వహిస్తున్న లిమిటేషన్ యాక్టుపై న్యాయాధికారులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. విశ్రాంత న్యాయాధికారి మోహన్‌రావు, విశ్రాంత జిల్లా న్యాయాధికారి ఎస్.రజిని లిమిటేషన్ యాక్టుపై న్యాయాధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికారులు కమలా దేవి, పీజే సుధ, డి.అమ్మన్నరాజు, పి.వాసు, ఎం.శోభారాణి, ఎస్.శ్రీవిద్య, ఎంవీ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



అంతంత మాత్రమే..



- సమస్యల్లో ప్రభుత్వాస్పత్రులు
- వేధిస్తున్న వైద్యుల కొరత
- వైద్యశాఖలో కఠినతర నిబంధనలు
- క్షేత్రస్థాయిలో అమలుకాని పరిస్థితి
- ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ కష్టాలు
- చాలీచాలని భవనాల్లో విధులు
- ఇబ్బందుల్లో డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. అయినప్పటికీ పలు కారణాల వల్ల ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. ముఖ్యంగా ప్రభుత్వాస్పత్రులు సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్యుల కొరత వేధిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 30 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యశాఖలో రాష్ట్ర ప్రభుత్వం కఠినతర నిబంధనలు అమలు చేస్తుండటంతో వైద్యులు నిరాశ చెందుతున్నారు. ఉద్యోగులు ఎఫ్ఆర్ఎస్‌తో ఇక్కట్లు పడుతున్నారు. గతంలో క్షేత్రస్థాయి వారికి మినహాయింపు ఉండేది. ప్రస్తుతం దాని తొలగించి అందరికీ వర్తింపజేస్తున్నారు.

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు వైద్యసేవలు అంతంత మాత్రమే లభిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆస్పత్రుల్లో అనేక మార్పులు తెస్తున్నా క్షేత్రస్థాయిలో అమలుకాని పరిస్థితి నెలకొంది. పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ల్లో పనిచేసే వైద్యాధికారులు మొక్కుబడిగా వైద్యశాలలకు వెళ్లిపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పీహెచ్‌సీలో వైద్యుల కొరత వేధిస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన సేవలు అందించేందుకు ఒక్కొక్క పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించారు. నంద్యాల జిల్లాలో 59 పీహెచ్‌సీలకు 19 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 14 మంది పీజీ కోర్సు చదవడానికి వెళ్లారు. కర్నూలు జిల్లాలోని 35 పీహెచ్‌సీల్లో 11 వైద్యుల పోస్టులు ఖాళీఉండగా.. 9 మంది పీజీ చదువుల కోసం వెళ్లడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో 30వైద్యుల పోస్టులు ఖాళీలు ఏర్పడటంతో గ్రామీణ ప్రాంతాల్లో సేవలు స్థంబించాయి.

ఎఫ్ఆర్ఎస్ కత్తి

ఉద్యోగులు ఖచ్చితమైన వేళకు విధులకు హాజరయ్యేలా వైద్యఆరోగ్య శాఖలో ఇటీవల ముఖహాజరు గుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) నిబంధనలకు తీవ్రతరం చేశారు. ఆలస్యంగా విధులకు వచ్చిన వైద్యసిబ్బంది, విధులకు గైర్హాజరైన వారు, నెట్‌వర్క్ సమస్యతో ఎఫ్ఆర్ఎస్ వేయకపోయిన వారికి ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులు నోటీసులు జారీచేస్తున్నారు. 100మీటర్ల నుంచి 50 మీటర్ల ఎఫ్ఆర్ఎస్ పరిధిని తగ్గించడంతో వైద్యసిబ్బందికి కష్టాలు రెట్టింపయ్యాయి. ఇటీవల ఐఫోన్‌లో ట్యాంపరింగ్ చేసి ఎఫ్ఆర్ఎస్ వేసినట్లు కర్నూలు జిల్లాలో 7 మంది వైద్యసిబ్బందిని గుర్తించి నోటీసులు జారీచేశారు. ఇక గ్రామీణ ప్రాంతంలో సరైన నెట్‌వర్క్ లేని కారణంగా మారుమూల ప్రాంతాల్లో ఎఫ్ఆర్ఎస్‌ను ఉద్యోగులు నమోదు చేయడం లేదు. గతంలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు బయోమెట్రిక్, ఎఫ్ఆర్ఎస్ మినహాయింపు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మూడుసార్లు ఆలస్యంగా వచ్చిన ఉద్యోగులకు జీతాలు నిలుపుదల చేయడంతో ఆందోళన చెందుతున్నారు. క్షేత్రస్థాయి ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలి.

శిథిలావస్థలో డీఎంహెచ్‌వో భవనం..

కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. మొదటి అంతస్తులో పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో కొన్ని గదులకు అధికారులు తాళాలు వేసి చాలీచాలని భవనాల్లో బిక్కుబిక్కుమంటున్నారు. డీఎంహెచ్‌వో ఆఫీసు నిజంగా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం కాదు. రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (ఫీమేల్)కు చెందిన నర్సుల హాస్టల్. డీఎంహెచ్‌వో ఆఫీసు మొదట మలేరియా ఆఫీసులో ఉండేది. అక్కడ భవనాలు పైకప్పు ఊడిపడుతుండటంతో ఖాళీచేసి ఆర్‌టీసీ ఫిమేల్ ట్రైనింగ్ సెంటర్‌కు చెందిన నర్సుల హాస్టల్‌లో చేరారు. ప్రస్తుతం ఇదే డీఎంహెచ్‌వో ఆఫీసుకు కొనసాగుతుంది. 1998లో ప్రస్తుతం డీఐవో ఆఫీసుపై అంతస్థులులో డీఎంహెచ్‌వో ఆఫీసు కట్టించాలని ఆదేశాలు జారీ చేసినా వాటిని ఎక్కడా అమలు చేయకపోవడంతో పాతభవనంలోనే ఆఫీసులో కొనసాగిస్తున్నారు. పక్కనున్న అనంతపురం, కడప, చిత్తూరు ప్రకాశం జిల్లాల్లో డీఎంహెచ్‌వో ఆఫీసులకు కొత్త భవనాలు ఉన్నాయి. కానీ ఎంతోఘన చరిత్ర రాష్ట్ర పూర్వ రాజధానిగా ఉన్న కర్నూలులో మాత్రం డీఎంహెచ్‌వో కార్యాలయానికి కొత్త భవనం లేదు.

ఎల్‌పీసీలు ఇవ్వాలి

ప్రతి పీహెచ్‌సీలో 14 మంది మాత్రమే సిబ్బంది ఉండాలన్న గత ప్రభుత్వం చేసిన జీవో.నెం.143 ప్రకారం ఎంపీహెచ్‌ఈవో, సీహెచ్‌వోల్లో ఒక్కరు మాత్రమే పీహెచ్‌సీలో ఉండాలి. గత ఏడాది 143 జీవో ప్రకారం కౌన్సిలింగ్ జరిపి రీడిప్లాయిమెంటు కింద బదిలీచేసి నేటివరకు ఎల్‌పీసీలు ఇవ్వలేదు. పనిచేసేది కర్నూలు జిల్లాలో.. మరో జిల్లాలో జీతం తీసుకుంటున్నారు. జీవో.నెం.143 ప్రకారం ఎంపీహెచ్‌ఈవో ఉన్న పీహెచ్‌సీలకే రెగ్యులర్ సీహెచ్‌వోలుగా పదోన్నతులపై పోస్టింగ్ ఇవ్వడం, వైద్యఆరోగ్యశాఖ ఆంతర్యం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ 14 ప్యాట్రాన్ ప్రకారం సిబ్బంది ఉంటే రిడిప్లాయ్ కింద ఉన్న ఎంపీహెచ్‌ఈవో ఉండాలా..? లేదా పదోన్నతి పొందిన సీహెచ్‌వో ఉండాలా వైద్య శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలి.

ఎస్పీవై ఆగ్రోతో శ్రీధర్‌రెడ్డికి సంబంధం లేదు

- సంస్థ డైరెక్టర్ సుజల వెల్లడి

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌తో సజ్జల శ్రీధర్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని సంస్థ డైరెక్టర్ సుజల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం స్కాంలో అరెస్ట్ అయిన సజ్జల శ్రీధర్‌రెడ్డిని కంపెనీ ప్రస్తుత యజమాని ప్రమోటర్, డైరక్టర్ అని ఇటీవల పలుచోట్ల ప్రచారం జరుగుతోందని, అందులో ఏమాత్రం వాస్తవం లేదని పేర్కొన్నారు. 2022 జనవరిలో శ్రీధర్‌రెడ్డికి ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌లో డైరక్టర్‌గా సమయం ముగిసిందన్నారు. ప్రస్తుతం కంపెనీలో ఆయన షేర్ హోల్డింగ్ మాత్రమేనని, కనీసం సంతకం చేసే అధికారం కూడా లేదన్నారు. శ్రీధర్‌రెడ్డి ఎస్పీవై ఆగ్రోలో కొనసాగుతున్నట్లు దర్యాప్తులో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు అవాస్తవమన్నారు. లిక్కర్ స్కాంలో ప్రమేయం ఉన్న రాజ్ కసిరెడ్డితో అతని వ్యక్తిగత అనుబంధమే తప్ప తమ ఫ్యాక్టరీకి ఎలాంటి సంబంధం లేదన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఓర్వకల్లు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కల్యాణ్ (32) విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సొంతింటిని నిర్మించుకుంటున్నారు. మిద్దెపై పనులు చేస్తుండగా ఇంటిపై ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కల్యాణ్ భార్య భూమిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఛాతీలో నాలుగు కేజీల కణితి తొలగింపు

- ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన వైద్యుడు



రోగితో డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఛాతిలో ఉన్న నాలుగు కేజీల కణితిని సీనియర్ కార్డియోథోరాసిక్ సర్జన్ డా.చింతా ప్రభాకర్‌రెడ్డి ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా విజయవంతంగా నిర్వహించి ప్రాణాన్ని కాపాడారు. డోన్ మండలం జొన్నగిరికి చెందిన 40 ఏళ్ల దాసరి బేబి కొంతకాలంగా విపరీతమైన దగ్గుతో బాధపడుతున్నారు. ఓ ప్రైవేటు కాలేజీలో స్వీపర్‌గా పనిచేస్తున్న ఆమె దగ్గు మరీ ఎక్కువై ఊపిరి ఆడని పరిస్థితిలో ఈనెల 4వ తేదీన కర్నూలు జీజీహెచ్‌లోని కార్డియో థొరాసిక్ విభాగానికి వచ్చారు. సీటీ సర్జన్ డా.ప్రభాకర్ రెడ్డి పరీక్షలు నిర్వహించగా.. ఛాతీలో పెద్దగడ్డ ఉన్నట్లు గుర్తించారు. ఏకంగా ఆ గడ్డ ఎడమ వైపు ఛాతినంతా ఆక్రమించి గుండెను కుడి వైపున తోసేసింది. రక్తనాళాలు, వాయునాళాలను కూడా గట్టిగా ఒత్తేయడంతో మహిళకు సమస్యలు ఎక్కువయ్యాయి. రోగికి ఎంఆర్ఐ, సీటీ స్కాన్ చేసి గడ్డ ఎంత సైజులో ఉందో నిర్ధారించారు. చాలా ఖరీదైన ఆపరేషన్ కావడంతో ఈ నెల 22వ తేదీన ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా రోగికి థొరాకాటమి ద్వారా ఆపరేషన్ చేసి నాలుగు కేజీల కణితిని తొలగించారు. రోగి కోలుకొని శనివారం డిశ్చార్జి అయ్యారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ లక్ష మందిలో ఒకరికి ఇటువంటి సమస్య వస్తుందని, ఛాతీలో 4 కేజీల కణితి ఉండటం చాలా అరుదని తెలిపారు. ప్రతి నెల 15 మంది వరకు బైపాస్ సర్జరీ చేయించుకుని రోగులు వెళ్తుంటారని తెలిపారు.

అవయవదానంతో ఒకరికి పునర్జన్మ

- కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా
- 'జీవన్‌దాన్' రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం



అవయవదాన రిజిస్టర్‌ను ప్రారంభించిన కలెక్టర్

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అవయవదానంతో మరో వ్యక్తి పునర్జన్మ ఇవ్వవచ్చని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌లో 56 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్, కిమ్స్ ఆసుపత్రుల సీఎండీ డా.బొల్లినేని భాస్కర్‌రావు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అవయవదానం మానవతా కోణంతో చేసే గొప్పపని అని అన్నారు. కిమ్స్ హాస్పిటల్‌లో ఇప్పటివరకు 56 కిడ్నీ మార్పిడులు చేయడం గొప్ప విషయమని అభినందించారు. జీవన్‌దాన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవయవదానాన్ని అమలు చేస్తున్నాయన్నారు. కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జీవన్‌ధాన్ ద్వారా లక్ష అవయవదానాలను రిజిస్టర్ చేసుకునే ప్రక్రియను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మొదట అవయవదాన రిజిస్టర్‌ను కిమ్స్ గ్రూప్ ఆసుపత్రుల సీఎండీ డా.బొల్లినేని భాస్కర్‌రావు చేయించుకొని మాట్లాడారు. కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో లివర్ మార్పిడిని త్వరలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు డా.ఉమామహేశ్వరరావు, నెఫ్రాలజీ, యురాలజిస్టులు డా.అనంతరావు, డా.మనోజ్, డా.రఫీక్ అహ్మద్, కిమ్స్ హాస్పిటల్ సీఈవో డా.సునీల్ సేపూరి పాల్గొన్నారు.

చోరీ కేసులో ఆరుగురి అరెస్టు

- వీరిలో ఐదుగురు మైనర్లు
- 27 తులాల బంగారు, 35 తులాల వెండి ఆభరణాల స్వాధీనం



రికవరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సాయి వైభవ్‌నగర్‌లో ఆర్టీసీ డిపో మేనేజర్ ఇంట్లో జరిగిన చోరీ కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ శేషయ్య శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిందితులంతా బాలురు కావడం విశేషం. నగర శివారులోని ఓ డాబాలో పని చేసే షేక్షా వలి అనే యువకుడు తనతో పాటు పని చేసే మరో ఐదుగురు మైనర్లను జత చేసుకున్నాడు. ఎలాగైనా దొంగతనం చేయాలని యుాట్యూబ్ లో వీడియోలు చూసి నేర్చుకున్నారు. ఇంటి తాళాలు పగలకొట్టేందుకు మెళకువలు నేర్చుకున్నారు. నూనె, రంపం, ఇనుపరాడ్లు సిద్ధం చేసుకున్నారు. రెండు మోటారు సైకిళ్లపైన సాయివైభవ్ నగర్‌లో రెక్కీ నిర్వహించారు.

మేనేజర్ ఇంట్లో తాళం వేసి ఉండడాన్ని గుర్తించి ఆ ఇంట్లోకి వెళ్లారు. ప్రధాన ద్వారం తాళంలో నూనెపోసి శబ్దం రాకుండా ఇనుపరాడ్డుతో తాళం విరిచారు. ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న 27 తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. ఆ తర్వాత చోరీ చేసిన సొత్తును పంచుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీ చేసిన సొత్తును రికవరీ చేశారు. వీరిలో ఇద్దరు ఇంతకముందే రెండు దొంగతనాలకు పాల్పడినట్లు తెలిసింది. ఈ మైనర్లంతా మెకానిక్ షెడ్లలో పని చేస్తూ అల్లరి చిల్లరగా తిరుగుతూ దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

నందవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ కౌలు రైతు చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మండలంలోని ముగతిగ్రామానికి చెందిన బోయ రంగన్న (55) ఆరెకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. గత మూడేళ్ల నుంచి దిగుబడి సరిగ్గా లేకపోవడంతో పెట్టుబడి డబ్బులు కూడా రాలేదు. మిరపకు తెగుళ్ల సోకి పంట మొత్తం నాశనం అవుతూనే వస్తోంది. అయితే సాగు కోసం సుమారు రూ.25 లక్షలు అప్పు చేశారు. అప్పు ఎలా తీర్చాలోనని మనవేదన చెందేవారు. ఈ క్రమంలో ఈనెల 24న పొలంలోనే పురుగుల మందు తాగారు. అక్కడే ఉన్న వ్యవసాయ కూలీలు గమనించి ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. రంగన్న భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రంగన్నకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. టీడీపీ నాయకుడు భార్గవ్ యాదవ్ రైతు మృతదేహానికి నివాళి అర్పించారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా



సంతజూటూరులో స్టిక్కర్ అతికిస్తున్న బొజ్జా

బండిఆత్మకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం కోసం మే 31న జరిగే ప్రజా బహిరంగ సభకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సంతజూటూరు గ్రామంలో శనివారం సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం కోసం పాదయాత్ర జరిగి 9వ వార్షికోత్సవం సందర్భంగా మే31 బహిరంగ సభ ను విజయవంత చేయాలని ఇంటింటికి స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని నిర్వహించారు. బొజ్జా మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టును పూర్తిగా రాయలసీమ తాగు, సాగు నీటి అవసరాలకే కేటాయించాలని, కేసీ బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరారు. రాయలసీమలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నీ మూడు సంవత్సరాల్లోగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. సిద్ధేశ్వరం అలుగు రాయలసీమ రైతాంగానికి గుండెలాంటిదని, ప్రభుత్వం దీన్ని నిర్మించి కరువుసీమను సశ్యశ్యామలం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వైఎస్‌రెడ్డి, ముమ్మడి కృష్ణారెడ్డి, రాముడు, భాస్కర్‌రెడ్డి, శ్రీహరి, మాబాషా, సుధాకరరావు పాల్గొన్నారు.

పర్యావరణ హిత ప్రగతి

- కర్నూలు నగరంలో కాలుష్య నియంత్రణ, సుందరీకరణకు చర్యలు
- రూ.7.87 కోట్ల ఎన్‌క్యాప్ నిధులతో అభివృద్ధి



నగరంలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో కాలుష్య నియంత్రణ, పర్యావరణహిత కార్యక్రమాలకు పెద్దపీట వేయనున్నారు. ఈమేరకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, నగరపాలక సంస్థ ఉమ్మడి సహకారంతో ప్రగతి ప్రణాళికను రూపొందించారు. ఇందుకు అవసరమైన ఆర్థిక తోడ్పాటును కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ అందించనుంది. ఈ క్రమంలో ఎన్‌క్యాప్(నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగాం) కింద రూ. 7.87కోట్ల నిధులను కేటాయించింది. వీటి ద్వారా నగరాన్ని సుందరీకరించటంతో పాటు, కాలుష్యాన్ని నియంత్రించే దిశగా పనులను ప్రతిపాదించి, ఆమోదం పొందారు.

రహదారుల విస్తరణ, పచ్చదనం పెంపు

ఎన్‌క్యాప్ కింద రూ.7.87 కోట్ల నిధులు మంజూరు కాగా, వీటి ద్వారా ప్రధానంగా రహదారుల విస్తరణ, కూడళ్ల వృద్ధి, కాలిబాటల ఏర్పాటు, పచ్చదనం పెంపునకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. దాదాపు 18 పనులను రూపొందించి వాటిని కలెక్టర్ వద్ద ఆమోదం పొందారు. ఇందులో రూ.5.49 కోట్లతో రహదారి పనులను నిర్వహించాలని, రూ.2.20 కోట్లతో పార్కులు, రోడ్ల డివైడర్ల మధ్య పచ్చదనం పెంపుతో పాటు మొక్కలు నాటాలని నిర్ణయించారు. మరో రూ.15లక్షలతో రాజ్ విహార్ కూడలి, కలెక్టరేట్, నగరపా లక సంస్థ వద్ద గాలి నాణ్యతను సూచించే సూచికలను ఏర్పాటు చేయా లని, రూ.3లక్షలు ప్రజాచైతన్య కార్యక్రమాల కోసం ప్రతిపాదించారు. కిడ్స్ వరల్డ్ నుంచి రాజ్‌విహార్ కూడలి, విశ్వేశ్వరయ్య కూడలి నుంచి సి.క్యాంపు, సి.క్యాంపు నుంచి బి.క్యాంపు ఆటోస్టాండు, సుంకేసుల రహదారిలోని సెయింట్ జోసఫ్ పాఠశాల నుంచి లేక్ రిడ్జ్ అపార్టుమెంట్ వరకు రహదారి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిం చారు. చెన్నమ్మ కూడలి నుంచి ఏపీఐఐసీ కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నారు. ఐదు రహదారుల కూడలి నుంచి బంగారు పేట, మదర్ థెరిసా విగ్రహం నుంచి ఘంటసాల విగ్రహం, ఉల్చాల వై జంక్షన్ వద్ద డివైడర్ల అభివృద్ధి, మొక్కలు నాటేందుకు ప్రతిపాదించారు. ఇక కిసాన్‌నగర్, మారుతీనగర్ పార్కుల్లో పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకోనున్నారు.

అభివృద్ధికి ఊతం

నగరం కాలుష్య కారకంగా మారటంతో దిద్దుబాటు చర్యలకు సంబంధిత శాఖలు నడుం బిగించాయి. ఏటా కాలుష్య నియంత్రణ మండలి పరిధిలో ఎన్‌క్యాప్ కింద నిధులు మంజూరు అవుతుండగా, ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయిచటం ఇదే మొదటి సారి. గతంలో ఈ నిధుల ద్వారా వాహనాల కొనుగోలు, వ్యర్థాలతో ఇటుకల తయారీ వంటి పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే ఈ సారి పూర్తిగా పర్యావరణానికి మేలు జరిగే పనులకే వెచ్చించను న్నారు. ముఖ్యంగా అధ్వానమైన రహదారుల వల్లే అధికశాతం దుమ్ముదూళి వస్తోందని నిపుణుల అధ్యయనంలో తేలింది. దీంతో తొలుత వాటిని బాగు చేయాలనే లక్ష్యంతో రహదారుల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అదేవిధంగా కాలుష్య నియంత్రణలో పచ్చదనం పెంపు ప్రాధాన్యాన్ని గుర్తించి ఈ పనులకు నిధులను ఖర్చు చేయనున్నారు.

సమష్టి సహకారంతో కాలుష్య నియంత్రణ



నగరంలో ఏ ప్రాంతంలో, ఏ రూపంలో కాలుష్యం వెలువడుతుందో గుర్తించి, ఆ దిశగా నియంత్రణ చర్యలు చేపట్టనున్నాం. ఇందులో భాగంగా అభివృద్ధి భాగస్వామ్యంతో కాలుష్యాన్ని నియంత్రించాలని ప్రణాళికలు రూపొందించాం. ఈ క్రమంలో నగరపాలక అధికారులు ఆవశ్యకత ఉన్న ప్రాంతాల్లో రహదారి విస్తరణ, పచ్చదనం పనులు చేపడుతున్నారు. దీనికి అవసరమైన ఆర్థిక సహకారం ఎన్‌క్యాప్ పథకం కింద సీపీసీబీ అందిస్తోంది. కర్నూలును కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడానికి కలెక్టర్ రంజిత్ బాషా ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. అందరి సహకారంతో కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతాం.

- పీవీ కిషోర్‌రెడ్డి, పర్యావరణ ఇంజనీర్, కాలుష్య నియంత్రణ మండలి,

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

పొగాకును కొనుగోలు చేయాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జగన్నాథం

ఓర్వకల్లు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పొగాకు పంటను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఓర్వకల్లులోని జీపీఐ గోడౌన్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమానికి రైతు సంఘం నాయకులు రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 18వేల ఎకరాల్లో పొగాకు పంటను సాగు చేశారన్నారు. అయితే కంపెనీలు రైతులను నమ్మించి ఒప్పించి విత్తనం ఇచ్చి పొగాకు క్వింటం రూ.15 వేలకు కొనుగోలు చేస్తామని చెప్పిన కంపెనీలు ఐటీసీ, జీపీఐ, ఈఎస్‌టీ రైతులను రకరకాల పేరుతో మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సుధాకర్, నాయకులు దొడ్డిపాడు బాషా, రాముడు, భీముడు పాల్గొన్నారు.

కేశవరెడ్డి విద్యార్థినికి కలెక్టర్ అభినందన



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం కలెక్టర్ తన కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ రంజిత్ బాషా అభినందిం చారు. స్థానిక వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాలకు చెందిన విద్యార్థిని తన్మయి గాయత్రీ 597/600 మార్కులు సాధిం చిందని కలెక్టర్ రంజిత్ బాషా, డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. అనంతరం విద్యార్థిని తన్మయి గాయత్రీని సన్మానించారు. కేశవరెడ్డి పాఠశాలల వ్యవస్థాపకుడు ఎన్.కేశవరెడ్డి మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి రాష్ట్ర స్థాయిలో మార్కులు సాధించామని, అదే ఆన వాయితీతో ఈ ఏడాది కూడా మా పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయిలో 597 మార్కులు సాధించిన తన్మయి గాయిత్రీని కలెక్టర్, డీఈవోలు అభినందించడం ఇందుకు నిదర్శనమన్నారు. అనంతరం కలెక్టర్, డీఈవోలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'పది'లో గుడ్‌షపర్డ్ విద్యార్థుల ప్రతిభ

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గుడ్‌షపర్డ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ జేసుదాసు తెలిపారు. శనివారం స్థానిక గౌతమి నగర్‌లోని గుడ్‌షపర్డ్ పాఠశాలలో పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కే.శిరీష 591/600 మార్కులు, సాయివెంకట్ 586, అక్షయ 580 మా ర్కులతో పాటు 570కి పైగా ఎనిమిది మంది విద్యార్థులు, 550కి పైగా 18 మంది, 500కి పైగా 35 మంది విద్యార్థులు సాధించా రన్నారు.

ర్యాలీని జయప్రదం చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఈనెల 28న జరిగే భారీ ర్యాలీని జయప్రదం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం ఆవాజ్ కమిటీ కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి జమాతే ఇస్లామియా ఏ హింద్ నాయకులు మునీర్ అహ్మద్, ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌ఏ.సుభాన్, విశ్రాంత ప్రిన్సిపాల్ నిసార్ అహ్మద్, జేఏసి నాయకుడు ఆఫీజ్ సయ్యద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మునీర్ అహ్మద్ మాట్లాడుతూ నగరంలోని ఇస్లామియా అరబీ కాలేజీ గ్రౌం డ్ నుంచి భారీ ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. ఈసమావే శంలో నాయకులు ఎస్ఎండీ షరీఫ్, ఇస్మాయిల్, ఇలియాజ్ పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నాం: ఏపీటీఎఫ్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో అమాయకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద కొవ్వొ త్తులతో నిరసన తెలిపి మృతులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా హృదయ రాజు మాట్లాడుతూ దేశ ప్రజల మధ్య విచ్ఛిన్నతను సృష్టించడమే ఉగ్రవాదుల లక్ష్యం అన్నారు. కార్యక్ర మంలో ఏపీటీఎఫ్ నాయకులు పీవీ శేషయ్య, కే.తిమ్మప్ప, టీవీ రామ కృష్ణయ్య, నరేంద్రనాథ్, యూసుఫ్ బాషా, చాంద్‌బాషా, రామలిం గేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, డేవిడ్ రవిశేఖర్, యోగేంద్ర బాబు రామ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడా పోటీలు ప్రారంభం

గూడూరు ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తిమ్మగురుడు స్వామి జాతరను పురస్కరించుకుని చైతన్య యూత్ అధ్యక్షుడు మాజీ జడ్పీటీసీ ఎల్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు అట్టహాసంగా జరిగాయి. శనివారం గూడూరు పాతబస్టాండులో నిర్వహించిన సైకిల్ పందెం, పరుగు పందెం పోటీలను నగర పంచాయతీ చైర్మన్ జే.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ ఎల్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత 32 సంవ త్సరాలుగా జాతర సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దస్తగిరి, కుమార్, విజయుడు, బజారి, మాజీ ఉప సర్పంచ్ ఎస్‌కే జిలాని, ప్రధాన కార్యదర్శి క్రిష్ణ మనోహర్ పాల్గొన్నారు.

ఒకే ప్రాంగణంలో ఉంటే సమస్యలే..

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని బి.క్యాంపులోగల ప్రభుత్వ పురుషుల కళాశాల క్లస్టర్ యూనివర్సిటీలో భాగమైనందున ఇదే ప్రాంగణంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వ విద్యాలయం తాత్కాలికంగా సర్దుబాటు చేయాలనే ప్రయత్నం సహేతుకమని, రెండు విశ్వ విద్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉంటే సమస్యలేనని ప్రభుత్వ పురుషుల కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది వై. జయరాజ్ అన్నారు. శనివారం కళాశాల పూర్వ విద్యార్థుల అత్యవసర సమావేశం జయ రాజ్ కార్యాలయంలో నిర్వహించారు. కళాశాలలో నెలకొన్న సమస్య లపై వారు చర్చించారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ 1980లో ప్రైవేటు భవనంలో ఉన్న కళాశాలను అనేక కష్టాల నడుమ ప్రస్తుతం ఉన్న సొంత భవనంలోనికి తీసుకు వచ్చామని అన్నారు. అలాగే కళాశాల స్థలం ఆక్రమణదారుల చర్యలను నిలువరించామని అన్నారు. సంఘం కార్యదర్శి ఆచార్య మన్సూర్ రహమాన్ మాట్లా డుతూ ఒకే విధమైన పాఠ్య ప్రణాళిక అవలంబిస్తున్న రెండు విశ్వ విద్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉంటేలా చేసే ప్రయత్నాలు సత్ఫలితాలు ఇవ్వవని చెప్పారు. సంఘం వ్యవస్థాపక సభ్యుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాల స్థాపనకు 12 ఎకరాల స్థలాన్ని పూర్వ విద్యార్థులు కొనుగోలు చేసి కర్నూలు ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా అందించామని గుర్తు చేశారు. అందువల్ల ఈ స్థలాన్ని కేవలం ప్రభుత్వ పురుషుల కళాశాల అభివృద్ధి నిమిత్తమే ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ కార్య నిర్వాహక సభ్యులు, గౌరవ సలహాదారులు ఎస్ఎండీ ఇసాక్, డబ్ల్యూ సుధాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం రసాభాస

- టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం
- తాగునీరు, రోడ్లు, పారిశుధ్యంపై సభ్యుల గళం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సుంకేసుల రోడ్డులోని నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే గత సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మినిట్ రూపంలో సమాధానం ఇవ్వాలి.. ఎందుకు ఇవ్వడం లేదని కార్పొరేటర్లు నిలదీయడంతో వాగ్వాదం మొదలైంది. నగరపాలక సంస్థ సమావేశంలో లేవనెత్తిన ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వడం లేదు..? కార్పొరేటర్ల మాటలకు విలువ లేదా..? అంటూ వైసీపీ కార్పొరేటర్లు నిలదీశారు. మేయర్ రామయ్య మీ పార్టీ వాడే.. ఆయనే సమాధానం ఇవ్వాలి.. మీరే గట్టిగా నిలదీయండి..? అని టీడీపీ కార్పొరేటర్లు కె.పరమేశ్, క్రాంతికుమార్ అన్నారు. దీంతో టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాదన సాగింది. ఈ క్రమంలో వైసీపీ కార్పొరేటర్ యూనుష్ కుర్చీలు, నీటి బాటిళ్లు పైకెత్తి నేలకేసి కొట్టారు. వైసీపీ కార్పొరేటర్లు వాకౌట్ చేశారు. పరిస్థితి చేయిదాటిపోతుందని గ్రహించిన మేయర్ రామయ్య సమావేశం పది నిమిషాలు వాయిదా వేశారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులు, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన 38వ కార్పొరేటర్ గిప్సన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఎంపీ, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు తొలిసారి హాజరు కాగా పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు, మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు ఘనంగా సన్మానించారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, ఎస్ఈ రాజశేఖర్, సీపీ ప్రదీప్ కుమార్, ఈఈలు శేషసాయి, సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ చుండీ ప్రసాద్, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, ఆర్ఓ జునైద్ పాల్గొన్నారు.

రెండు గంటల పాటు నిలబడి నిరసన

20 వార్డు కార్పొరేటర్ నాగలక్ష్మీరెడ్డి సమావేశంలో సుమారు రెండు గంటల పాటు నిలబడి నిరసన తెలిపారు. తాను అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పేంత వరకు కూర్చొనేది లేదని కరాఖండిగా చెప్పేశారు. తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని ప్రతి రోజు తాగునీరు సరఫరా చేస్తామని గత సంవత్సరం జరిగిన సమావేశంలో ఎస్ఈ రాజశేఖర్ హామీ ఇచ్చారని కార్పొరేటర్ గుర్తుచేశారు. దానికి సమాధానం చెప్పాలని కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల వాగ్వాదం

పద్దెనిమిది అంశాలకు ఆమోదం

నగర పాలక సంస్థ సర్వసభ్యసమావేశంలో 19 అంశాలపై పాలక వర్గ సభ్యులు చర్చించారు. అయితే 19వ అంశమైన రాజవిహార్ నుంచి విశ్వేశ్వరయ్య కూడలి వరకు 80 అడుగుల రోడ్డును 120 అడుగుల రోడ్డుగా విస్తరించేలా ప్రణాళికలు సిద్ధంచేసినట్లు అంశంలో పేర్కొన్నారు. దీంతో మెడికల్ కళాశాల పక్కనే ఉన్న మసీదు దుకాణాలకు ఇబ్బంది అవుతుందని ఇదొక్క అంశాన్ని పెండింగ్ పెట్టాలని కొందరు కార్పొరేటర్లు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఒక్క అంశం పెండింగ్‌లో పెట్టి మిగిలిన 18 అంశాలకు ఆమోదం తెలిపారు.

కేసీ కాలువను ప్రక్షాళన చేయాలి



నగరంలో కేసీ కెనాల్‌ను ప్రక్షాళన చేయాలి. కేసీ కాలువలో వ్యర్థాలు, డ్రైనేజీ నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి. మామిదాలపాడులో రోడ్లు, కాలువలు నిర్మించాలి. నీటి ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయాలి. మూడు వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి.

- బొగ్గుల దస్తగిరి, ఎమ్మెల్యే, కోడుమూరు

తాగునీటి సమస్యను పట్టించుకోరా..?



పాణ్యం నియోజకవర్గంలోని 16 వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అధికారుల లెక్కలో మాత్రం తాగునీటి సరఫరా చేస్తున్నామని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో చూస్తే అందరికి అర్థమవుతోంది. 16 వార్డుల నుంచే కార్పొరేషన్‌కు ఎక్కువ ఆదాయం వస్తుంది. తాగునీటి కోసం నిమిషానికి ఒకరు ఫోన్ చేస్తున్నారు. కార్పొరేటర్లు అడిగిన ప్రశ్నలకు సమాధాన తక్షణమే ఇవ్వాలి.

- గౌరుచరితారెడ్డి, ఎమ్మెల్యే, పాణ్యం

నగదు వసూలు చేయకూడదు



నగరంలో రోడ్లు, కాలువలు వేసే సమయంలో ఇంటికి సంబంధించిన కొళాయి మరమ్మతులకు గురైతే దాని ఖర్చు కార్పొరేషన్ భరిస్తుంది. ఈ విషయంపై ఇటీవల కొన్ని చోట్ల తెలియని వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్నారని నా దృష్టికి వచ్చింది. నగదు వసూలు చేయరాదు. ఫిట్టర్ రవిశంకర్ డబ్బులు వసూలు చేసినట్లు కార్పొరేటర్ ఫిర్యాదు మేరకు అతనిని సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేశా.

- రవీంద్రబాబు, కమిషనర్, నగరపాలక సంస్థ

చెడ్డపేరు తీసుకురావద్దు



కార్పొరేషన్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారమైన ప్రయత్నం చేస్తా. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దు. నగరంలో నీటి, పారిశుధ్య సమస్య ఉంది. అధికారులు, కార్పొరేటర్లు సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకొని నగరాన్ని అభివృద్ధి పరచాలి.

- బస్తిపాటి నాగరాజు, ఎంపీ, కర్నూలు జిల్లా

అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి



అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి. కార్పొరేటర్లు అడిగిన ప్రశ్నలకు తక్షణమే సమాధానం ఇవ్వాలి. మినిట్స్ బుక్ అంశాలపై అప్రమత్తంగా ఉండాలి. ప్రతి ఒక్క కార్పొరేటర్ కూడా సమావేశంలో సమస్యలపై ప్రస్తావించే అధికారం ఉంది.

- బీవై రామయ్య, మేయర్

కబడ్డీ విజేతలకు బహుమతి ప్రదానం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తిమ్మగురుడు స్వామి జాతరను పురస్కరించుకుని గూడూరులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన మొదటి విజేత అయ్యకొండ టీంకు టీడీపీ నాయకుడు రాజారెడ్డి రూ.25వేలు, రెండో విజేత ప్యాపిలి టీంకు రూ.15వేలు చెట్టుకింది సురేష్ అందజేశారు. మూడో విజేత పచ్చర్ల టీంకు రూ.10వేలు సంగాల మధు, నాలుగో విజేత తెగడొడ్డి టీంకు రూ.5వేలు నాగరాజు అందజేశారు. ఈ సందర్భంగా కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ మాట్లాడుతూ ఎంజీబీ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజారెడ్డి, చెట్టుకింది సురేష్, సంగాల మధు, రేవుల గోవిందు, చెట్టుకింది నారాయణ, ఎంజీబీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గుట్టపాడును నందనవనంగా తీర్చిదిద్దుతా



సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న మోహన్ రెడ్డి

ఓర్వకల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండంలోని గుట్టపాడు గ్రామాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతానని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, సర్పంచ్ నర్ల మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండలం లోని గుట్టపాడు గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ.25లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ గ్రామంలో 700 మీటర్ల సీసీ రోడ్డు వేశామని, అలాగే ఉక్కు పరిశ్రమ నిధులు రూ.1.25 కోట్లతో గ్రామాభివృద్ధి ప్రతిపాదనలు పంపామని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజనీర్ ధరణి, గ్రామ నాయకుడు జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

సి.బెళగల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-2007 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 18 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒక చోటు కలుసుకుని పాత జ్ఞాప కాలను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పటి గురువు లకు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ సరవన్‌సాబ్, లక్ష్మీబాయి, పద్మావతి, పూర్వ విద్యార్థులు దేవేంద్ర గౌడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదరావు సేవలు మరువలేనివి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ సీనియర్ నాయకుడు ప్రసాద్‌రావు సేవలు మరువలేనివని సంఘం జిల్లా అధ్యక్షుడు గోకారి, ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న అన్నారు. శనివారం స్థానిక సలాం ఖాన్ ఎస్టీయూ భవన్‌లో ప్రసాద్‌రావు సంస్మరణ సభ నిర్వహించారు. ప్రసాద్‌రావు చిత్రపటానికి పలువురు నివాళుల ర్పించారు. నాయకులు మౌలాలి, అంజుమ్ బేగ్, జిల్లా గౌరవాధ్యక్షులు రమేష్, సురేష్, దేవదాసు, గోవిందు, వెంకట్రాముడు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

నగరంలో పోలీసుల తనిఖీలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న బాంబు స్క్వాడ్ బృందం



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ పహల్గాం ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో కర్నూలు నగరంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేశారు. బస్టాండు, రైల్వేస్టేషన్, రాజ్‌విహార్ సర్కిల్, పలు మాల్స్‌లలో తని ఖీలు చేశారు. తాలుకా పోలీసు ఆధ్వర్యంలో పంచలింగాల చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

చిలుకూరు ప్రభాకర్ మృతి



చిలుకూరు ప్రభాకర్(ఫైల్)

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర పూర్వ విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధ్యక్షుడు, పేట శ్రీరామా లయం శతాబ్ది ఉత్సవ సమితి అధ్యక్షుడు చిలుకూరు ప్రభాకర్ (60) మృతి చెందారు. నగరంలోని షరాఫ్ బజార్‌లో బాలాజీ జ్యువెలర్స్ అధినేత అయిన ఆయన శుక్రవారం సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాదులోని కిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడే గుండె పోటు రావడంతో చికిత్స పొందుతూ రాత్రి 9 గంటలకు తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహాన్ని కర్నూలులోని ఆయన స్వగృహా నికి తీసుకువచ్చారు. భౌతిక కాయానికి మాజీ కార్పొరేటర్ విఠల్ శెట్టి, వీహెచ్‌పీ నాయకులు టీసీ మద్దిలేటి, నీలి నరసింహ, ఈపూరి నాగరాజు, ఆర్ఎస్ఎస్ నాయకుడు విఠల్‌రావు, బీజేపీ నాయకుడు సందడి సుధాకర్‌లు సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శనివారం పాత నగరంలోని హిందూ స్మశాన వాటిక హరిశ్చంద్ర ఘాట్‌లో కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య, మాళిగి వ్యాసరాజ్, కోశాధికారి సందడి మహేష్, రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్, విశేష సంపర్క్ విభాగ్ కన్వీనర్ టి. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ చిలుకూరి ప్రభాకర్ హఠాత్తుగా మరణించడం జీర్ణించుకోలేని విషయమని అన్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

'బీఎస్ఎన్ఎల్ సేవలను వినియోగించుకోవాలి'

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ డివిజినల్ ఇంజినీర్, ఏజీఎం ఎన్ దేవచంద్ నాయక్ అన్నారు. శనివారం నగరంలోని సి.క్యాంపులోని టీటీడీ కల్యాణ మంటపం వద్ద ఏర్పాటు చేసిన రోడ్‌షో కార్యక్రమంలో వినియోగ దారులతో ఆయన మాట్లాడారు. 'కనెక్టింగ్ విత్ కేర్' అనే నినాదంతో తమ సంస్థ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కస్టర్ సర్వీస్ క్యాంపులను ఏర్పాటు చేసిందని, వినియోగదారులు తమ సమస్యలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ సీఎఫ్‌పీ డాట్ బీఎస్ఎన్ఎల్ డాట్ సీఓ డాట్ ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ తమ ఫిర్యాదులను పంపుకోవచ్చని తెలిపారు.

● **ఎఫ్‌టీటీహెచ్ సర్వీసులో కొత్త ఆఫర్లు:** బీఎస్ఎన్ఎల్ భారత్ ఫైబర్ ఇంటర్నెట్ సర్వీస్‌లో ప్రత్యేక డిస్కౌంట్‌లను ప్రవేశ పెట్టారని తెలిపారు. ఫైబర్ బేసిక్ నియో 449 ప్లాన్, ఫైబర్ బేసిక్ 499 ప్లాన్ తీసుకున్న వారికి మొదటి నెలలో ఉచితంగా సర్వీసులను పొందవచ్చని, తర్వాత మూడు నెలల వరకు రూ.50, రూ.100 డిస్కౌం ట్‌లను పొందవచ్చని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఐఎఫ్ టీవీ సర్వీసు ద్వారా ఇంటర్నెట్‌తోపాటూ టీవీ చానెళ్లు వీక్షించవచ్చని తెలిపారు. ఏజీఎం అర్బన్ వి.శ్రీను నాయక్, ఎస్‌డీఈలు పి.బాలాజీ రెడ్డి, టి.వెంకటేశ్వర్లు, పి. మహమ్మద్ హుస్సేన్, టీఐపీలు వెంకటేశ్వర్లు, మురళీకృష పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు: సీపీఎం

కల్లూరు, ఏప్రిల్ 26:(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయొద్దని, కరెంట్ చార్జీలు తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల అన్నారు. శనివారం కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన నిర్వహించిన న్యూసిటీ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు టీడీపీ అధికారంలోకి వస్తే స్మార్ట్‌మీటర్లు పెట్టమని ఇచ్చిన హామీని తుంగలో తొక్కి గత ప్రభుత్వానికన్నా వేగంగా స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్నారని ఆరోపించారు. దీంతో గతంలో కన్నా రెండు, మూడింతలు కరెంట్ బిల్లులు అధికంగా వస్తున్నాయన్నారు. స్మార్ట్‌మీటర్ మాకొద్దు..కరెంట్ చార్జీలు తగ్గించాలి స్టిక్కర్‌ను విడుదల చేశారు. సీహెచ్ సాయి బాబా, కే.సుధా కర్, నరసింహులు, అరుణ, ప్రభాకర్, జి.ఏసు పాల్గొన్నారు.



స్టిక్కర్లు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

సీనియర్ డాక్టర్‌ను వైసీపీ అవమానించింది

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సీనియర్ డాక్టర్, ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్‌ను వైసీపీ ప్రభుత్వం అవమానించిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు వై. నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పోతురాజు రవికుమార్, ధరూర్ జేమ్స్, పాలక వీటి విజయకుమార్, నంద్యాల నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి మహేష్ గౌడ్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి ఉపకులపతిని చేయ డాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అవమానాలకు గురైన డాక్టర్ చంద్రశేఖర్ రాజకీయాలకు అతీతంగా తను వైద్య సేవలు అందించారని తెలిపారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో డాక్టర్ చంద్రశేఖర్‌ను మాజీ మంత్రి బుగ్గన అవమానించారని, పైగా టీడీపీ ముద్ర వేసి ఎలాంటి పదవులు, పదోన్నతులు రాకుండా అడ్డుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆనాడు బీసీ సంఘాల నాయకులతో కలిసి ఉద్యమాలు చేశామని గుర్తు చేశారు. డాక్టర్ చంద్రశేఖర్ సేవలను గుర్తించి ఉపకుల పతిగా నియమించడంపై ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల తరపున సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేష్‌కు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. నాయకులు సత్రం రామక్రిష్ణ కే, చంద్రకాంత్, పేరపోగు రాజు పాల్గొన్నారు.

నవోదయం-2ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మద్యపానం.. వ్యసన విముక్తి కోసం చేపట్టిన నవోదయం-2 కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నూలు మండలం పసుపుల గ్రామం లో కేర్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తాగడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్‌గౌడ్, సీఐలు రాజేంద్ర ప్రసాద్, చంద్రహాస్, సిబ్బంది పాల్గొన్నారు.

● **సారా స్థావరాలపై దాడులు:** నగరంలోని బంగారుపేట కాలనీలోని నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. శనివారం సాయంత్రం 1000 లీటర్ల నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం ఊట, 25 లీటర్ల సారాయిని ధ్వంసం చేశారు. నీలిషికారీ మహలీ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వేర్వేరు ప్రాంతాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఎరుకలి నరసింహులు, పుసులూరు బోయ అయ్యా స్వాములను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు జయ రాం నాయుడు, చంద్రహాస్, ఎస్ఐ రవితేజ, రెహనా, నవీన్, సిబ్బం ది నందిశ్వరరెడ్డి, చంద్రపాల్, ఈరన్న పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోండి

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ కాడెట్లు, విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ సూచించారు. శనివారం కర్నూలు గ్రూప్ వన్ ఆంధ్ర మెడికల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో శనివారం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ మాట్లా డుతూ దేశంలో గత సంవత్సరం 1.70 లక్షల మంది ప్రమాదానికి గురయ్యారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు నివారణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్యాంపు కమాండెంట్ వైవీ చైతన్యరెడ్డి, దాసరి సుధీర్, ఎన్‌సీసీ ఆఫీసర్లు విజయకుమార్, వెంకటేశ్, అనిల్, ప్రతాప్, రఘు, పాపారాయుడు పాల్గొన్నారు.

మే డే విజయవంతం చేయండి

క్రిష్ణగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మే డే విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం అన్నారు. శనివారం టోల్‌ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం అమకతాడు టోల్ ప్లాజాలో నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 4 లేబర్ కోడ్‌లు అమలుచేయకుండా పోరాడాలన్నారు. డోన్ పట్టణ సిఐటీయూ ఉపాధ్యక్షుడు రామచంద్రుడు, రాజు, గోపాలకృష్ణ, మహేష్ నాయుడు, మహేష్, మధు, నాగేంద్రుడు, భాగ్యరాజ్, మద్దయ్య, ఖాన్ పాల్గొన్నారు.

వైసీపీ సంయుక్త కార్యదర్శిగా కేవీఆర్



మద్దికెర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డిని వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తనను ఎంపిక చేసినందుకు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులకు నగదు అందజేస్తున్న సుంకన్న

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్ వసతి గృహ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించడం అభినందనీయమని డోన్ యశోదా హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ సుంకన్న అన్నారు. శనివారం ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో పత్తికొండ డివిజన్ పరిధిలో 500కు పైగా మార్కులు సాధించిన పత్తికొండ బాలికల హాస్టల్ విద్యార్థిని వైష్ణవి బాయి, జొన్నగిరి బాయ్స్ హాస్టల్ శివప్రసాద్ నాయక్, ఎరుకుల చెరువు హాస్టల్ విద్యార్థి కే.సురేంద్ర కుమార్, కంబలపాడు హాస్టల్ విద్యార్థి వరుణ్, పత్తికొండ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థి రంజిత్‌కు రూ.5వేల నగదు అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బాబు, వార్డెన్‌లు వెంకటేశ్, నాగరాజు, రమేష్, వెంకట్రాముడు, పావని, భారతితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తున్నాం

ఆదోని టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ, మతం అడిగి మరీ చంపడం అమానుషమన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల వారు ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పోరాటం సాగించాల్సిన సమయం వచ్చిందన్నారు. కేంద్రం సైనిక చర్య తీసుకుని ఉగ్రవాదులను అణచి వేయాలని కోరారు. తాయన్న, శేఖర్, రవి, జిలాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవిశెట్టి ప్రకాష్

ఉపాధి కూలీలకు ప్రమాద బీమా

హాలహర్వి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు ప్రమాద భీమా సౌకర్యం కల్పిస్తున్నామని ఏపీవో చక్రవర్తి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి, ప్రధానమంత్రి సురక్ష యోజన భీమా పథకాలు వర్తిస్తాయన్నారు. జాబ్‌కార్డు ఉన్న కూలీలంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కార్పొరేట్ విద్యాసంస్థల బ్యానర్లను తొలగించాలి

ఆదోని అగికల్చర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల బ్యానర్లను తొలగించాలని ఏఐఎస్ఎస్ పట్టణ నాయకుడు శేఖర్ డిమాండ్‌రు. శనివారం మునిసిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ప్రధాన కూడళ్లలో తమ విద్యాసంస్థల్లో అధిక మార్కులు వచ్చాయంటూ తల్లిదండ్రులను మభ్యపెట్టి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు వినయ్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వైసీపీ ప్రచార కార్యదర్శిగా జనార్దన్ నాయుడు



ఆలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా కోనంకి జనార్దన్ నాయుడును అధినాయకత్వం నియమించింది. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి సమాచారం అందింది. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, కూటమి ప్రభుత్వం నెరవేర్చని హామీలపై విస్తృతంగా ప్రచారం చేస్తానన్నారు. తనకు అవకాశం కల్పించిన అధినేత వైఎస్ జగన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

హంద్రీ నీవా ద్వారా సాగునీరు ఇవ్వాలి

దేవనకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లకొండ నుంచి పి.కోటకొండ వరకు హంద్రీనీవా ద్వారా సాగునీరు ఇవ్వాలని రైతుసంఘం మండల అధ్యక్షుడు సూరి డిమాండ్ చేశారు. శనివారం పి.కోటకొండలో సంతకాలు సేకరించారు. హంద్రీనీవా నీరు సగం మండలానికే వస్తోందని, స్లూయిజ్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో ఇవ్వాలన్నారు. నాయకులు కౌలుట్ల, కృష్ణ, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

వారంలోపు తాగునీరు : ఏఈ

మద్దికెర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామ్‌నగర్, సాయినగర్ కాలనీకి జల్‌జీవన్ కింద వారంలోపు తాగునీరందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ తెలిపారు. శనివారం బస్టాండు వద్ద చేస్తున్న పైపులైన్ పనులు పరిశీలించారు. జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికి కొళాయి కనెక్షన్ ఇస్తామని, రూ.40లక్షలతో సాయిన గర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తయిందని, త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరరెడ్డి ఉన్నార

బిల్లుల కోసం ఎదురుచూపులు

- పూర్తయిన గోకులాలు
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం



మద్దికెర మండలంలో పూర్తయిన గోకులం

మద్దికెర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎంతో నమ్మకంతో గోకులం షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. మండలంలో 8 గ్రామ పంచాయతీలకు 32 మినీ గోకులాల షెడ్లు మంజూరయ్యాయి. షెడ్ల నిర్మాణం కూడా పూర్తయింది, ఎమ్మెల్యే శ్యాంబాబు చేతుల మీదుగా ప్రారంభించి నెల అవుతోంది. అయినా బిల్లులు మంజూరు కాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ఒక్కో గోకులం షెడ్ల నిర్మాణానికి మొత్తం రూ.2.23లక్షలు. ప్రభుత్వం రూ.2లక్షలు ఇస్తుండగా, రైతు రూ.23వేలు వాటా కట్టాల్సి ఉంది. తీరా నిర్మాణం పూర్తయాక ఇలా అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

నివేదికలు పంపాం

మండలంలో పూర్తయిన గోకులం షెడ్ల వివరాలను జిల్లా అధికారులకు పంపాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. **- ఏపీవో నర్సిరెడ్డి, మద్దికెర**



హాలహర్వి మండలంలో నిర్మించిన గోకులం

హాలహర్వి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గానికి 250 మినీ గోకులం షెడ్లు మంజూరు కాగా, హాలహర్వి మండలానికి 41 కేటాయించారు. దీంతో రైతులు షెడ్లు నిర్మించుకున్నారు కాని బిల్లులు మంజూరు కాలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

త్వరలోనే బిల్లులు

గోకులం షెడ్లు నిర్మించుకున్న వారికి త్వరలో బిల్లులు వస్తాయి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో ఖాతాలో నిధులు జమవుతాయి.

- చక్రవర్తి, ఏపీవో, హాలహర్వి

కూలీలు ఉదయమే పనికి రండి

- ద్వామా పీడీ వెంకటరమణయ్య
- తుగ్గలి, మద్దికెర మండలాల్లో ఉపాధి పనుల పరిశీలన



తుగ్గలి మండలం రాతనలో మస్టర్లను తనిఖీ చేస్తున్న పీడీ

తుగ్గలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు ఉదయమే పనికి వచ్చి త్వరగా ఇళ్లకు వెళ్లాలని, పనులు ద్వామా పీడీ వెంకటరమణయ్య సూచించారు. శనివారం మండలంలోని రాతన, తుగ్గలిలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ కొలత ప్రకారం చేస్తే రూ.300ల కూలి వస్తుందన్నారు. పనికి వచ్చిన వారి పేర్లనే మస్టరులో చేర్చాలని, అలా కాకుంటే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. తమకు తాగునీరు, మజ్జిగ ఇవ్వాలని కూలీలు కోరగా, ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. పీవోలు హేమసుందర్, వెంకటేశ్వర్లు, టీఏలు రాజ శేఖర్, రామకృష్ణ, ఎఫ్ఏలు శ్రీనివాసులు, భీముడు, బాలమద్దయ్య, మల్లికార్జున, సతీష్ చౌదరి, బలరాముడు, గిరిగిట్ల రంగడు ఉన్నారు.

మద్దికెర: కూలీలందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ద్వామా పీడీ వెంకటరమణయ్య అన్నారు. శనివారం పెరవలి, ఎం.అగ్రహారం గ్రామాల్లో ఉపాధి పనులు పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ ఎండలు మండిపోతున్నాయనీ, అందువల్ల ఉదయం, సాయంత్రం ఉపాధి పనులు చేసుకోవాలని సూచించారు. చ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూగ జీవాల కోసం నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలని ఆదేశమిచ్చిందని, సిబ్బంది వాటిని పూర్తి చేయాలన్నారు. ఏపీవో నర్సిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు మెడికల్ రాము, హనుమేష్ ఉన్నారు.

విద్యార్థులకు సబ్ కలెక్టర్ అభినందనలు

- ప్రతిభ చూపినవారికి బహుమతులు



విద్యార్థినికి బహుమతి ఇస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అభినందించారు. శనివారం కార్యాలయంలో డిప్యూటీ ఈవో వెంకట రమణ రెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో 9 మంది విద్యార్థులను అభినిందించా, వారికి బహుతులను అభినందించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని మనసారా కోరుకుంటున్నా నన్నారు. నిరంతర నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసంతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన ఆరేకల్లు మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల (76మంది విద్యార్థులు) ఎమ్మిగనూరు మండలం బనవాసి ఏపీ ఆర్ఎస్ పాఠశాల 79 మంది విద్యార్థులు) ప్రిన్సిపాళ్లు జె యమునాదేవి, పీ సామ్రాజ్యాన్ని సబ్‌కలెక్టర్ సన్మానించారు. డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొలం సమస్యపై అధికారుల విచారణ



విచారణ చేస్తున్న స్పెషల్ కలెక్టర్, ఆర్డీవో

వెల్దుర్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):మండలంలో గోవర్ధనగిరి గ్రామంలో రైతు సోడా మద్దిలేటికి చెందిన పొలం సమస్యపై శనివారం శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో సందీప్ కుమార్ విచారణ చేశారు. సర్వే నెం. 23లో 5 ఎకరాలు ఉండగా, 2016 నుంచి తగాదా ఉంది. అలాగే నార్లాపురం, వెల్దుర్తి గ్రామాల్లో ఎంఎల్ఎస్ పాయింట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించి అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ చంద్రశేఖరవర్మ, డీటీ గురుస్వామిరెడ్డి, ఆర్ఐ మంజుల, విఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అమృతాపురం గ్రామ వైసీపీ నాయకుడు వెంకటేష్‌ను హత్య చేసిన వారిని ఎమ్మెల్యే విరుపాక్షి సోదరుడు బూసినే వెంకటేష్ కోరారు. శనివారం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సీఐ రవిశంకర్ రెడ్డితో మాట్లాడుతూ హత్యలు పునరావృత్తం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థినికి కలెక్టర్ సన్మానం

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాలలో 597 మార్కులు సాధించిన విద్యార్థిని దేవనకొండ సలీమాను కలెక్టర్ రంజిత్ బాషా, డీఈవో శామ్యూల్ పాల్ శనివారం సన్మానించినట్లు కిడ్డీస్ పాఠశాల డైరెక్టర్లు కేశవ నారాయణ రెడ్డి, చిన్నపరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు వరుసగా రాష్ట్రస్థాయిలో టాపర్లగా నిలవడం అభినందనీయమన్నారు. విద్యార్థులు నిరంత శ్రమతో ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు.



సలీమాను సన్మానిస్తున్న కలెక్టర్, డీఈవో

పాలిసెట్ హాల్ టికెట్లు విడుదల

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలీసెట్-25 హాల్ టికెట్లు విడుదల అయినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కలాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈనెల 30వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని, విద్యార్థులు ఏపీ పాలిసెట్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సమస్యలుంటే ఈనెల 29వ తేదీలోపు తమ కళాశాలలో తెలియజేయాలని, వివరాలకు 8121555646 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ఆదోని టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వస్తువుల అమ్మకంలో నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా.సందీప్ కుమార్ హెచ్చరించారు. శనివారం మాట్లాడుతూ, తక్కువ సామర్థ్యం ఉన్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, కప్పులు విక్రయించకూడదని సూచించారు.

సాహితీ స్రవంతి డివిజన్ కమిటీ

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సాహితీ స్రవంతి డివిజన్ కమిటీని శనివారం యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా డాక్టర్ సక్కరి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా జంగం స్వయంప్రభ, గౌరవాధ్యక్షురాలిగా నాగమణి, సహాధ్యక్షులుగా బత్తిన మహాదేవి, కోశాధికారిగా ఎం.వోంకార్, సంయుక్త కార్యదర్శి గౌరవ సలహాదారులుగా విశ్రాంత తాహసీల్దార్ శేక్షావలి ఎన్నికయ్యారు. సభ్యులుగా సుబ్బన్న, సుధాకర్, మేరీ జాయ్, సువర్ణ జోషి, చిన్న వెంకటేశులు, రాజశేఖర్, వీరేష్, జంబులింగయ్య, మహేష్ ఎన్నికయ్యారు. గురజాడ, శ్రీశ్రీ, గుర్రం జాషువా జయంతులను ప్రభుత్వం అధికారికంగా పాఠశాలల్లో నిర్వహించాలని కోరారు.



డాక్టర్ సక్కరి భాస్కర్



జంగం స్వయంప్రభ

పాకిస్థానీయులు ఉంటే సమాచారం ఇవ్వండి

దేవనకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వీసాపై వచ్చిన పాకిస్థానీయులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ ప్రసాదురాజు సూచించారు. పాకిస్థాన్ నుంచి వచ్చిన వారిని పంపాలని కేంద్ర ప్రభుత్వం జీవో 25022/20/2025 జారీ చేసిందన్నారు. పాక్‌దేశం వారు ఉంటే ఈ నెల 29న వైద్య పరీక్షలు నిర్వహించి పాకిస్థాన్‌కు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

తప్పులు సరిచేసుకోండి

మద్దికెర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా తప్పులు సరిచేసుకోవాలని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ సూచించారు. శనివారం మాట్లాడుతూ జాబితాలో మార్పులు చేర్పులు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే ఓటర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్ఐ సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ తదతరులు ఉన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆలూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మరచేడు గ్రామ బస్టాండ్ ఆవరణలో శనివారం గుర్తు తెలియని వాహనం డీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల మేరకు.. మానేకుర్తి గ్రామానికి చెందిన యు.అయ్యళ్ళి తన కుమారుడు సిద్దుతో కలసి టీవీఎస్ ఎక్సెల్‌పై ఆదోనికి వెళుతుండగా కమ్మరచేడు బస్టాండ్ ఆవరణలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం కొట్టి వెళ్లిపోయింది. అయ్యళ్ళి తలకు తీవ్ర గాయాలు కావడంతో కమ్మరచేడు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

- ఎంపీటీసీ సభ్యుడు రమేష్
- మండల సమావేశంలో వాగ్వాదం

ఆలూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని హులేబీడు టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు రమేష్ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నిధులు మంజూరు కావడం లేదని, పంచాయతీల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. స్పందించిన ఈవోపీఆర్డీ వై.ప్రభాకర్ చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ద్వారా చెత్తను సేకరిస్తున్నారని తెలిపారు. అనంతరం వైస్ ఎంపీపీ శ్రీరాములు, టీడీపీ ఎంపీటీసీ సభ్యుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకుని సర్ది చెప్పారు. ఎంపీపీ రంగమ్మ, ఎంపీడీవో సయ్యద్ మహబూబ్ బాషా మాట్లాడుతూ అందరి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని, సమస్యలు తలెత్తకుండా పంచాయతీ వారు చూడాలని సూచించారు. తహసీల్దార్ గోవింద్‌సింగ్, ఏఈలు రామ్ లీలా చౌడరెడ్డి, ఏపీవో శ్రీనివాసులు, ఏపీఎం ఆంజనేయ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పత్తికొండలో కూలిన విద్యుత్ స్తంభం

- త్రుటిలో తప్పిన ప్రమాదం
- భయంతో పరుగులు పెట్టిన ప్రజలు



తేరుబజారు వద్ద కూలిన విద్యుత్ స్తంభం



యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్న సిబ్బంది

పత్తికొండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే తేరుబజారు పెద్దమసీదు వద్ద విద్యుత్తు స్తంభం శనివారం సాయంత్రం కూలింది. స్తంభం కింద కడ్డీలు విరగడంతో ప్రమాదం చోటుచేసు కుంది. 11 కేవీ లైన్లు కూడా ఈ స్తంభంపైనే ఉండడంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. అయితే స్తంభం నెమ్మదిగా ఒరగడంతో గమనించిన ప్రజలు దూరంగా వెళ్లారు, దీంతో ఎవరికీ ప్రమాదం సంభవించలేదు. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేయించారు. నేలకొరిగిన స్తంభానికి ఉన్న వైర్లను తొలగించారు. అనంతరం నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కాగా స్తంభాల పరిస్థితిని పర్యవేక్షించాల్సిన విద్యుత్తు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాలి

ఆదోని, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాలని టీడీపీ నాయకులు భూపాల్ చౌది, రామస్వామి, రంగస్వామి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకట చౌదరి, మారుతి నాయుడు, అప్సర్ బాషా డిమాండ్ చేశారు. శనివారం రాత్రి పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదం దేశాన్ని పట్టి పీడిస్తోందని, పాకిస్తాన్ కయ్యానికి కాలు దువ్వుతూ ఉగ్రవాదచర్యలు ప్రేరేపిస్తోందనీ, ఫలితంగా మనం చాలా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదానికి ముగింపు పలకాలని అన్నారు. ఉగ్రవాదులంతా ఒకటిగా మారుతున్నారని తెలుస్తోందని, అదే జరిగితే ప్రపంచ దేశాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పీవోకేను స్వాధీనం చేసుకుంటే ఉగ్రవాదం అణగిపోతుందన్నారు.



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

నల్ల మట్టినీ వదలడం లేదు

- బరితెగిస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ బీజేపీ నాయకుడు నేషనల్ హైవే పనుల్లో తలదూర్చి అక్కడి నల్లమట్టిని తమ వాహనాల్లో తరలించి అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పరి ప్రధాన రహదారిలోని పెట్రోలు బంకు వద్ద జాతీయ రహదారి పనులు చేస్తున్నారు. అయితే ఈ పనుల్లో బీజేపీ నాయకులు తలదూర్చి మట్టి తరలించి, టిప్పర్ రూ.1,500లు, ట్రాక్టర్ రూ.1,000లకు అమ్ముకుంటున్నట్లు సమాచారం..

మా దృష్టికి వచ్చింది

నల్లమట్టిని తమ అవసరాలకు వినియోగిస్తామన్నందుకు బీజేపీ నాయకుడికి అనుమతి ఇచ్చాం. అయితే వారు మట్టిని అమ్ముకుంటున్నారని నా దృష్టికి వచ్చింది. విచారించి ఇకపై మేమే మట్టిని తరలిస్తాం. **- ఉపేంద్ర, నేషనల్ హైవే ప్రాజెక్టు మేనేజర్, ఆదోని**



ఎక్స్‌కవేటర్‌తో తరలిస్తున్న నల్లమట్టి

వాహనాలను సీజ్ చేస్తాం

జాతీయ రహదారి పనుల్లో ఇతరుల జోక్యం సహించం, ప్రభుత్వ స్థలంలో నల్లమట్టి తవ్వకాలు ఎలా చేస్తారు. అలా తరలించేవారిపై చర్యలు తీసుకుని, జరిమాన విధిస్తాం, వాహనాలను సీజ్ చేస్తాం.- **మౌర్య భరద్వాజ్, సబ్ కలెక్టర్, ఆదోని**

మంత్రాలయంలో భక్తుల సందడి



భక్తులతో కిటకిటలాడుతున్న మఠం ప్రాంగణం

మంత్రాలయం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. శని, ఆదివారాలు వారాంతాలు కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి షేూది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం, మద్వమార్గ్ కారిడార్ భక్తులతో కిక్కిరిసి పోయింది. అన్నపూర్ణ భోజనశాల, మహ ముఖద్వారం, ప్రధానరోడ్లన్నీ, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘ వేంద్రస్వామి మూలబృందావనానికి పూజలు నిర్వహించి మొక్కు లు తీర్చుకున్నారు.

మఠం గోశాలకు రూ.లక్ష విరాళం

మంత్రాలయం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మ ఠానికి విజయవా డకు చెందిన మోహన్‌రెడ్డి అనేభక్తుడు రూ. లక్ష గోశాలకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్ తెలిపారు. శనివారం మోహన్‌రెడ్డి కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. దాత కు టుంబానికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు స్వామి వారి జ్ఞాపికను, శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలిచ్చి ఆశీర్వదించారు.

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు



నవరత్నాల రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. చైత్రశుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని మఠం పీఠాధి పతి సుబుధేంద్ర తీర్థులు బృందావ నానికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం నుంచి రాఘవరాయుడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి స్వర్ణకవచంతో చూడముచ్చటగా అలంకరించారు. వేద పం డితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథం పై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగిం చారు. అనంతరం ఉత్సవమూర్తికి ఊంజల సేవ నిర్వహించారు.

చెక్క పల్లకిలో ఊరేగిన ప్రహ్లాదరాయలు: మంత్రాలయం రాఘవేం ద్రస్వామి పూర్వ అవతారమైన ప్రహ్లాదరాయలను చెక్క పల్లకి లో వైభవంగా ఊరేగించారు. శనివారం రాత్రి చైత్ర త్రయోదశి శుభది నాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యం లో ప్రహ్లాదరాయలకు పాదపూజ చేసి హారతులిచ్చారు. చెక్క పల్లకిలో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. స్వామివారు పల్లకిలో ఊరేగు తుండగా.. భక్తులు జయధ్వానాలు పలికారు. అనంతరం భక్తులు స్వామి వారి ఊంజల సేవలో పాల్గొని తరించి మంత్రముగ్ధులయ్యారు. మఠం దివాన్ శ్రీనాథాచార్ ఊంజల సేవ నిర్వహించారు.

విద్యార్థులకు కలెక్టర్ సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థు లను శనివారం కలెక్టర్ రంజిత్ బాషా సన్మానించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్‌కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పది విద్యార్థి ప్రేమ్ గణేష్ 588 మార్కులు సాధించి ప్రభుత్వ, జడ్పీ పాఠశా లల్లో పట్టణ టాపర్‌గా నిలిచాడు. పట్టణంలోని నారాయణ ప్రైవేటు పాఠశాలకు చెందిన సోహైల్ సిద్దిక్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి పది పరీక్షల్లో 597 మార్కులు సాధించాడు. వీరి ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం, కలెక్టర్ జిల్లా కేంద్రంలో పట్టణానికి చెందిన ఇరువురు విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగభూషణం రెడ్డి, విద్యార్థి బంధువు శివశంకర్, నారాయణ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సబ్ కలెక్టర్ అభినందనలు



ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌తో బహుమతి అందుకుంటున్న విద్యార్థిని షేక్ అఫ్రీన్

కోసిగి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ బడులో చదివి మండల టాపర్‌గా నిలిచిన దుద్ది జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని షేక్ అఫ్రీన్‌ను శనివారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అభినందించారు. గ్రామీణ ప్రాంతం నుంచి ప్రభుత్వ బడుల్లో చదివి షేక్ అఫ్రీన్ 555/600 మార్కులు సాధించడం చాలా గొప్ప విష యమన్నారు. మంచి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని సబ్‌కలెక్టర్ సూచించారు. డిప్యూటీ డీఈవో వెంకటరమ ణారెడ్డి, ప్రధా నోపాధ్యాయులు రాముడు, విద్యార్థిని తండ్రి షబ్బీర్ ఉన్నారు.

29, 30 తేదీల్లో కేవీకే ఆవిర్భావ దినోత్సవం

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) 60వ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 29, 30వ తేదీల్లో నిర్వహించనున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సదస్సుకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు. రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

దంచికొడుతున్న ఎండలు

• అల్లాడిపోతున్న ప్రజలు
• రైల్వేగేటు రెండువైపులా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని వేడుకోలు

కోసిగి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కోసిగి మండలంలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలోనే అత్యధికంగా కోసిగి మండలంలో 43 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు వరుసగా మూడు రోజులు నమోదవుతున్నాయి. దీంతో ఉక్కపోతతో, ఎండవేడిమికి ప్రజలు, వృద్ధులు, చిన్నపిల్లలు అల్లాడుతున్నారు. కోసిగి లోని రైల్వేగేటు దగ్గర గేటు పడిన సమయంలో సుమారు 20 నిమిషాలకు పైగా వాహనదారులు నిలిచిపోవడంతో ఎండవేడిమిని



ఎండవేడిమికి చెట్టు కింద సేదతీరుతున్న వాహనదారులు



రైలు గేటు పడటంతో ఎండలోనే వేచి ఉన్న వాహనదారులు

తట్టుకోలేక సతమతమవుతున్నారు. రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై ఉరుకుందకు వెళ్లే కుటుంబం మహిళ, కూతురు ఎండ వేడిమికి తాళలేక సొమ్మసిల్లి పడిపోయారు. స్థానికులు గుర్తించి వీరిని నీడచాటున తీసుకెళ్లి సపర్యలు చేసి నీటిని తాపారు. పంచాయతీ, రైల్వే అధికారులు రైల్వేగేటు రెండు వైపులా చలువపందిళ్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. ముఖ్యంగా రైల్వేగేటు గుండా ఉరుకుంద దేవస్థానానికి, కౌతాళం మండలానికి వెళ్లే వాహన దారులు అధికంగా ఉండటంతో ఈ వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. రైల్వేగేటు రెండు వైపులా చలువ పందిల్లు ఏర్పాటు చేయాలని కోసిగి ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మున్సి పాలిటీల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్క రించని పక్షంలో మే 7నుంచి సమ్మెలోకి వెళ్తామని మున్సిపల్ ఇంజ నీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నారాయణ, శివరామకృష్ణ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కమిషనర్ గంగి రెడ్డికి సమ్మెనోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని సమ్మె చేస్తే చర్చలు జరిపిన సీడీఎంఏ ఫిబ్రవరి లేదా మార్చిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటివరకు సమస్యలను పరిష్కరించకపోగా జీతాలు పెంచలేదన్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో సమ్మెచేయాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఇంజనీరింగ్ కార్మి కులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్ర మం లో సంఘం నాయకులు విజయ్, నారాయణ, కన్న, జమీర్, బసీర్, గోవిందు, మధు, రఘు, రాంతుల్లా పాల్గొన్నారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

మృతులకు సీపీఐ, ఎస్టీయూ కొవ్వొత్తులతో నివాళి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి మారణకాండ సృష్టించటం హేయమైన చర్య అని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, భాస్కర్ యాదవ్, తిమ్మగురుడు, ఎస్టీయూ నాయకులు బసవరాజు, యల్లప్ప అన్నారు. పహల్గాం దాడిని ఖండిస్తూ దాడిలో మృతిచెందిన పర్యాటకులకు శనివారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా



కౌతాళంలో నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ నాయకులు

నాయకులు మాట్లాడుతూ దాడికి పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజీవ్, పౌలు, ఏఐఎస్ఎఫ్ విజేంద్ర పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి పిరికిపంద చర్య అని సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు అన్నారు. శనివారం ఉగ్రదాడిని ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొ త్తులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ ఉగ్ర దాడిలో అమాయకుల ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, అబ్దుల్లా, ఉస్మాన్, వలి, ఇస్మా యిల్, నాగరాజు, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శనివారం కౌతాళంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ముందుగా విశ్వహిందూ పరిషత్ సభ్యులు స్థానికంగా ఉన్న త్రిలింగేశ్వర స్వామి దేవాలయం నుంచి పురవీధుల గుండా కొవ్వొత్తులతో పాకిస్థాన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించి దాడికి నిరసనగా మౌనప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సభ్యులు వెంకటపతిరాజు, రాఘవేంద్రరెడ్డి మాట్లాడారు. ర్యాలీలో డాక్టర్ రాజానందు, వీరేశప్ప, శ్రీరాములు, నరేష్, రామచంద్రలు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో ర్యాలీ చేస్తున్న సీపీఐ, ఎస్టీయూ నాయకులు



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

'అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు'



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ విజయభాస్కర్

గోనెగండ్ల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. గోనెగండ్ల గ్రామంలో శనివారం ప్రజ లతో సమావేశమయ్యారు. సీఐ ప్రజల సమస్యలను అడిగి తెలు సుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

మే డేను విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మే డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కె. అనీఫ్, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి.ఏసేపు పిలుపుని చ్చారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక వర్గాలు పోరాడి సాధించు కున్న హక్కులను కాలరాస్తూ, బీజేపీ సర్కార్ తెచ్చిన లేబర్ కోడ్‌ల రద్దు కోసం అందరూ పోరాడాలన్నారు. కార్మికుల హక్కులను, చట్టాలను రద్దు చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేస్తూ, పరిశ్రమల్లో కార్మికుల తొలగిస్తూ, దేశ సహజ సంపద కార్పొరేటర్లకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. ఉద్యోగ భద్రత, శ్రమకు తగ్గ ఫలితం కోసం అసంఘటిత రంగ కార్మికుల వర్గం అంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మే డే కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జయన్న, తిమోతి, దావీదు, తిక్కయ్య, రామ లింగ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయడానికి ఆసక్తి ఉన్న వారు టెక్నికల్ సర్వేయర్లు, ఇంజనీర్ల లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఐటీఐలో సివిల్, డిప్లొమా ఇన్ సివిల్, బీటెక్(సివిల్) పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. అర్హులు తమ సర్టిఫికెట్లతో దరఖాస్తు చెసుకోవాలన్నారు. అన్ని అర్హతలు ఉన్న వారికి ఎల్‌టీపీ, లైసెన్సులు మంజూరు చేస్తామని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ కాలనీలో నివసిస్తున్న వకీలు రామక్క కోడలు జ్ఞానమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, టౌన్ బ్యాంకు వైస్ ఛైర్మన్ నరసప్ప, వార్డు ఇన్‌చార్జీ అంబేడ్కర్, టౌన్ బ్యాంకు డైరెక్టర్ ఆమె ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

మంత్రాలయంలో బాంబు స్క్వాడ్ తనిఖీలు

మంత్రాలయం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో డాగ్, బాంబు స్క్వాడ్ బృందాలు ముమ్మ రంగా తనిఖీలు చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మద్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, బస్టాండు, నదితీరం, శ్రీమఠం, అన్నపూర్ణ బోజనశాల, మాధవరం, తుంగభద్ర రైల్వేస్టేషన్లలో మంత్రాలయం సీఐ రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు శివాంజల్, విజయకుమార్ ఆధ్వర్యంలో బాంబు స్క్వాడ్ అధికారులు ఆచార్, రమేష్‌రెడ్డి, డాగ్ స్క్వాడ్ అధికారి ప్రసాద్‌తో అను మానం ఉన్న బ్యాగ్‌లు, స్థలాలను డాగ్, బాంబు కనుగొనే యంత్రాలతో తనిఖీలు చేశారు. మంత్రాలయం పురవీధులను జల్లెడ పట్టారు. శ్రీమ ఠం అధికారులతో కలిసి భద్రతపై చర్చించారు. మూడు రోజుల క్రితం కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడులకు నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు కొనసాగాయి. ఈ తనిఖీల్లో వెంకటేశ్వర్లు, రామకృష్ణ, గోపి, జమీర్, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



శ్రీమఠం వద్ద బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీ చేస్తున్న పోలీసులు

మంత్రాలయం సీఐకి ఉత్తమ అవార్డు

అభినందించిన ఎస్పీ

మంత్రాలయం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సీఐగా పని చేస్తున్న రామాంజులకు ఉత్తమ అవార్డు అందజేశారు. శనివారం కర్నూలులో జరిగిన సమావేశంలో మంత్రాలయం సర్కిల్ పరిధిలోని మాధవరం, మంత్రాలయం పోలీస్ స్టేషన్లలో నేరాలు అదుపు, కేసుల తగ్గుముఖం, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల కట్టడిపై విశేషంగా కృషిచేసిన సీఐ రామాంజులును ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. రెండు పోలీస్ స్టేషన్‌లలోని గ్రామాల్లో విశిష్ట పోలీసుల సేవలు అందించడంతో ఎస్పీ సంతృప్తిని వ్యక్తంచేశారు. మాధవరం, మంత్రాలయం ఎస్ఐలు విజయకుమార్, శివాంజల్‌ను కూడా అభినందించారు. మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న, టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, ఎస్ఐలు శివాంజల్, విజయకుమార్ సీఐకి అభినందనలు తెలిపారు.



సీఐకి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ విక్రాంత్

ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు

నందవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నందవరం ఎస్ఐ కేశవ్‌ను టీడీపీ నాయకుడు దేశాయి గురురాజారావు తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని సమస్యల గురించి ఎస్ఐ వారిని అడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్ రామ న్నగౌడు, షాదిక్, శివ, అజయ్, అనిల్, చాకలి అనుమన్న పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లిలో ఎనిమిది కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పార్లపల్లి గ్రామానికి చెందిన ముని, పెసెలదిన్నె గ్రామానికి చెందిన గోపాల్, దైవందిన్నె గ్రామానికి చెందిన రాజు కర్ణాటక నుంచి ఎనిమిది మద్యం బాక్సులను తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేశామన్నారు. ఎవరైనా కర్ణాట క మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



నిందితులను చూపుతున్న పోలీసులు

గాలి దుమారం

కూలిన చలువ పందిళ్లు



మధ్వమార్గ్ కారిడార్‌లో గాలికి నేలకొరిగిన చలువ పందిళ్లు

మంత్రాలయం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి సన్నిధానంలో ఎండవేడిమికి భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు శనివారం వీచిన గాలి దుమారానికి నేలకొరిగాయి. మధ్వ మార్గ్ కారిడార్‌లో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన మధ్వమార్గ్ కారిడార్ మహా ముఖద్వారం వద్ద చలువ పందిళ్లు కూలిపోయాయి. దీంతో శ్రీమఠం అధికారులు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ జోషీ, సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, శ్రీహరి కూలిన చలువ పం దిళ్లను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేసేందుకు శ్రీకారం చుట్టారు.

కుంటనహాల్‌లో వడగండ్ల వాన

కౌతాళం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన ఈదురు గాలులతో పాటు వడగండ్ల వాన కురిసినది. కుంటనహాల్ గ్రామంలో దాదాపు 30 నిమిషాల పాటు వడగండ్లు పడ్డాయి. దీంతో వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



వడగండ్లను చూపుతున్న దృశ్యం

ఉచిత శస్త్రచికిత్సలు అభినందనీయం

ఎమ్మిగనూరు,ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నిరుపేదలను గుర్తించి ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఆర్కే కంటి వైద్యశాల వైద్యుడు హేమంత్‌కుమార్ శస్త్రచికిత్సలు చేయడం అభినందనీయమని ప్రముఖ వైద్యులు డాక్టర్ గౌడప్పగౌడ్ అన్నారు. ఇటీవల కలుగొట్ల రోడ్డులోని జీసెస్ టెంపుల్‌లో నిర్వహించిన వైద్యశిబిరంలో అర్హులైన 50మందికి ఆర్కే కంటి వైద్యశాలలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి మందులు అద్దాలు అందజేశారు. శనివారం నిర్వహించిన ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గౌడప్ప గౌడ్ మాట్లాడుతూ నిస్వార్థ సేవతో పేదలకు సేవలు అందించి నప్పుడే ఆ సేవలకు విలువ ఉంటుంద న్నారు. హేమంత్‌కుమార్‌ను పలువురు సన్మానించారు. పాస్టర్ సోలో మెన్, గీతా మందిరం నటరాజ్, అడ్వకేట్ చార్లెస్, రాజేంద్ర ప్రసాద్, కమలమ్మ, అనూరాధ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.